www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

ఆదివారం | 5-5-2024

Kurnool | Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal Guntur | | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru | కర్నూలు

గూడూరు, మే 4: గూడూరు తిమ్మగురుడు రథోత్సవం శనివారం కోలాహలంగా సాగింది. వేలాదిగా తరలివచ్చిన భక్తులతో గూడూరు జనసంద్రంగా కనిపించింది. తిమ్మగురుడు స్వామి ఆలయంలో స్వామి వారికి పవిత్ర పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం రథోత్సవానికి పూజలు చేశారు. పోలీసులు పటిష్టమైన బందోబస్తు నిర్వహించారు.



భారీగా తరలి వచ్చిన భక్తులు

పారిశ్రామిక ప్రగతి తప్పింది..!



ఓర్వకల్లు సమీపంలో నిర్మిస్తున్న జైరాజ్ ఇస్పాత్ ఉక్కు పరిశ్రమ

- 33 వేల ఎకరాల్లో ఓర్వకల్లు ఇండస్ట్రియల్ హబ్
- సోలార్ పార్కు, పంప్డ్ స్టోరేజ్ విద్యుత్ ప్లాంట్‌కు శ్రీకారం
- జైరాజ్ ఇస్పాత్ ఉక్కు పరిశ్రమ.. డీఆర్‌డీఓ ఏర్పాటు
- మెగా సీడ్ హబ్, జైన్ ఇరిగేషన్ ప్రాజెక్టులు..
- కొలిమిగుండ్ల కేంద్రంగా సిమెంట్ పరిశ్రమలు
- చంద్రబాబు హయాంలో పురుడు పోసుకున్నవి ఎన్నో..
- జగన్ వచ్చాక అవన్నీ రద్దు.. నత్తనడకన మరికొన్ని..

కర్నూలు, మే 4 (ఆంధ్రజ్యోతి):

పరుగులు పెట్టాల్సిన పారిశ్రామిక రంగం కుంటి నడకన సాగుతోంది. లక్షలాది మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలనుకున్న చంద్రబాబు లక్ష్యం తడబాటుకు గురవుతోంది. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ఓర్వకల్లు కేంద్రంగా 33 వేల ఎకరాల్లో పారిశ్రామిక వాడ (ఇండస్ట్రియల్ హబ్) ఏర్పాటు చేశారు. ఆసియాలోనే అతి పెద్దదైన వెయ్యి మెగా వాట్ల సోలార్ పార్కు, పంప్డ్ స్టోరేజ్ విద్యుత్ ప్లాంట్‌కు శ్రీకారం చుట్టారు. జైరాజ్ ఇస్పాత్ ఉక్కు పరిశ్రమకు భూమి పూజ చేశారు. తంగడంచలో మెగా సీడ్ పార్కు, జైన్ ఇరిగేషన్ ప్రాజెక్టులు తీసుకొచ్చారు. కొలిమిగుండ్ల కేంద్రంగా మూడు భారీ సిమెంట్ పరిశ్రమలతో ఒప్పందం (ఎంఓయూ) చేసుకొని పనులకు శ్రీకారం చుట్టారు. ఓర్వకల్లు విమానాశ్రయం నిర్మించారు. ఐదేళ్లలో విజన్ కలిగిన చంద్రబాబు పారిశ్రామిక అభివృద్ధిని పరుగులు పెట్టించారు. జగన్ సీఎంగా బాధ్యతలు చేపట్టాక పారిశ్రామిక ప్రగతి కుదేలయింది. కొత్తగా ఒక్క పరిశ్రమ తీసుకురాకపోగా.. తెచ్చిన ప్రరిశ్రమలను రద్దు చేశారు.

చంద్రబాబు ఉక్కు సంకల్పం



జైరాజ్ ఇస్పాత్ ఉక్కు పరిశ్రమకు శంకుస్థాపన చేస్తున్న నాటి సీఎం చంద్రబాబు

టీడీపీ ప్రభుత్వంలో ఓర్వకల్లు మెగా ఇండస్ట్రియల్ హబ్‌గా ప్రకటించి జైరాజ్ ఇస్పాత్ ఉక్కు పరిశ్రమకు శ్రీకారం చుట్టారు. గుట్టపాడు, ఎస్.కొంతలపాడు గ్రామాల్లో 415 ఎకరాలు ఆ పరిశ్రమకు కేటాయించారు. రూ.1,658 కోట్ల పెట్టుబడితో ఏడాదికి ఏడు లక్షల మెట్రిక్ టన్నులు ఐరన్ ఉత్పత్తి లక్ష్యంగా ఏర్పాటు చేసిన ఈ జైరాజ్ ఇస్పాత్ ఉక్కు పరిశ్రమకు 2018 మే 10న నాటి సీఎం చంద్రబాబు శంకుస్థాపన చేశారు. వెయ్యి మందికి నేరుగా.. ఐదు వేల మందికి పరోక్షంగా ఉపాధి కల్పించేలా ఉక్కు పరిశ్రమకు శంకుస్థాన చేశారు. నిర్మాణం చివరి దశకు చేరుకుంది. వైసీపీ ప్రభుత్వం వచ్చాక ఆశించిన స్థాయిలో ప్రోత్సాహం లేకపోవడంతో ఐదేళ్లయినా ఉత్పత్తి మొదలు పెట్టలేదు. చంద్రబాబు ఉండి ఉంటే ఏనాడో ఉత్పత్తి మొదలయ్యేదని యువత అంటోంది.

జగన్ వచ్చాక..

వైసీపీ ప్రభుత్వం వచ్చాక ఈ ప్రాజెక్టు పనులు మూడేళ్లు ఆగిపోయాయి. టీడీపీ ప్రభుత్వంలోనే రూ.వేల కోట్లు ఖర్చు చేసిన గ్రీన్‌కో సంస్థ యాజమాన్యం ప్రభుత్వంతో జరిపిన చర్చలు సఫలం కావడంతో ఎట్టకేలకు 2022 మే 17న సీఎం జగన్ సిమెంట్ పనులకు శంకుస్థాపన చేశారు. ప్రపంచానికే విత్తన సరఫరా చేసే భాండాగారంగా మెగా సీడ్ హబ్ ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. ఉమ్మడి జిల్లా జూపాడుబంగ్లా మండలం తంగడంచ వ్యవసాయ క్షేత్రంలో 623.40 ఎకరాల భూమిని కేటాయించారు. అమెరికాకు చెందిన అయోవా విశ్వవిద్యాలయం సాంకేతిక సహకారంతో మెగా సీడ్ హబ్ ఏర్పాటుకు 2917 అక్టోబరు 9న చంద్రబాబు శంకుస్థాపన చేశారు. రూ.315 కోట్లతో డీపీఆర్ సిద్ధం చేశారు. మౌలిక వసతుల కల్పనకు బడ్జెట్‌లో రూ.100 కోట్లు కేటాయించారు. వ్యవసాయ శాఖ ఆధ్వర్యలో ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం 17 పంటలకు సంబంధించి 77 రకాల క్షేత్ర పదర్శనలు చేపట్టింది. వైసీపీ ప్రభుత్వం రాగానే మెగా సీడ్ హబ్‌ను రద్దు చేసింది. కేటాయించిన భూములను తంగడంచ ఫారమ్‌కు అప్పగించింది.

సూర్యకాంతి వెలుగులు:



చంద్రబాబు ప్రారంభిచన మెగా సోలార్ పార్క్

సూర్యకాంతితో కరువు సీమ రాయలసీమలో విద్యుత్ వెలుగులు నింపాలనే లక్ష్యంగా ప్రపంచంలోనే అతిపెద్ద సోలార్ పార్కుకు టీడీపీ ప్రభుత్వ హయాంలో నాటి సీఎం చంద్రబాబు శ్రీకారం చుట్టారు. ఓర్వకల్లు, గడివేముల మండలాల మధ్యన వెయ్యి మెగా వాట్లు విద్యుత్ ఉత్పత్తికి అల్ట్రా మెగా సోలార్ పార్క్ ఏర్పాటు చేశారు. రాష్ట్ర విభజన తరువాత 2014లో ప్రణాళికలు సిద్ధం చేశారు. శరవేగంగా పనులు పూర్తి చేసి 2017 అక్టోబరు నుంచే సోలార్ పవర్ ఉత్పత్తి మొదలు పెట్టారు. అంతటితో చంద్రబాబు సంతృప్తి చెందలేదు. పాణ్యం మండలం పిన్నాపురం వద్ద 5,230 మెగావాట్ల యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి లక్ష్యంగా సోలార్, విండ్, హైడల్ (పంప్డ్ స్టోరేజ్) విద్యుత్‌కు సంబంధించిన ఇంటిగ్రేటెడ్ పునరుత్పాదక ఇంధన ప్రాజెక్టు (ఇంటిగ్రేటెడ్ రెన్యువబుల్ ఎనర్జీ ప్రాజెక్టు-ఐఆర్‌ఈపీ)కు శ్రీకారం చుట్టారు. గ్రీన్‌కో కంపెనీ చేపట్టిన ఈ ప్రాజెక్టుకు పాణ్యం మండలం పిన్నాపురం, ఓర్వకల్లు మండలం గుమ్మటం తండా గ్రామాల్లో 4,750 ఎకరాల భూమి, గోరుకల్లు రిజర్వాయర్ నుంచి ఒక టీఎంసీ నీటిని చంద్రబాబు ప్రభుత్వం కేటాయించింది. రూ.15 వేల కోట్ల పెట్టుబడి లక్ష్యంగా పనులు కూడా మొదలు పెట్టారు.

ఓర్వకల్లు విమానాశ్రయం



మూతబడిన జైన్ ఇరిగేషన్ ప్రాజెక్టు

జూపాడుబంగ్ల మండలం తంగడంచ వ్యవసాయ క్షేత్రంలో ప్రతిష్టాత్మకమైన జైన్ ఇరిగేషన్ సిస్టమ్ పరిశ్రమకు చంద్రబాబు శ్రీకారం చుట్టారు. దీనికి 623 ఎకరాలు కేటాయించారు. 3,500 మందికి ప్రత్యేక్షంగా, పది వేల మందికి పరోక్షంగా ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించాలన్నది లక్ష్యం. రూ.340 కోట్లతో పైపులు, డ్రిప్ పైపులు తయారి సహా పండ్ల ప్రాసెసింగ్ ఏర్పాటు చేసేలా ఒప్పందం. ప్రాజెక్టు పూర్తి పెట్టుబడి లక్ష్యం రూ.800 కోట్లు. 2018లో చంద్రబాబు శంకుస్థాపన చేశారు. ముచ్చుమర్రి లిఫ్ట్ నుంచి నీటి సౌకర్యం అందించేందుకు ప్రభుత్వం డీపీఆర్ కూడా ఆమోదించింది. పనులు కూడా మొదలయ్యాయి. వైసీపీ ప్రభుత్వం వచ్చాక ఈ పరిశ్రమపైన కూడా పూర్తిగా నిర్లక్ష్యం ప్రదర్శించింది. ఫలితంగా ప్రాజెక్టు పనులు ఎక్కడికక్కడే ఆగిపోయి. ప్రభుత్వం కేటాయించిన భూముల్లో ముళ్ల పొందలు నిండిపోయాయి.



2017 అక్టోబరు 9న రిమోట్ ద్వారా మెగా సీడ్ పార్కుకు శంకుస్థాపన చేస్తున్న చంద్రబాబు (ఫైల్)

సిమెంట్ హబ్‌కు చంద్రబాబు శ్రీకారం

కొలిమిగుండ్ల కేంద్రంగా సిమెంట్ పరిశ్రమల హబ్‌గా చంద్రబాబు శ్రీకారం చుట్టారు. కల్వటాల, కనకాద్రిపల్లె, మీర్జాపురం గ్రామాల మధ్య 5,600 ఎకరాల విస్తీర్ణంలో రాంకో గ్రీన్‌ఫీల్డ్ సిమెంట్ పరిశ్రమతో ఒప్పందం చేసుకొని.. రూ.1,600 కోట్ల పెట్టుబడితో 3.15 మిలియన్ టన్నుల సిమెంట్ ఉత్పత్తి లక్ష్యంగా 500 మందికి ప్రత్యేకంగా, 1,000 మందికి పరోక్షంగా ఉపాధి, ఉద్యోగాలు కల్పించే ధ్యేయంగా రాంకో సిమెంట్ పరిశ్రమ తీసుకొచ్చారు. 2018 డిసెంబరు 14న చంద్రబాబు ఉండవల్లి నుంచి వర్చువల్ (వీడియో లింక్) ద్వారా శంకుస్థాపన చేశారు. 2020 ఫిబ్రవరి ఆఖరులోగా నిర్మాణం పూర్తి చేసి ఉత్పత్తి మొదలు పెట్టాలని లక్ష్యం. 4,600 ఎకరాల్లో ప్రిజం సిమెంట్ పరిశ్రమ, 4,600 ఎకరాల్లో గ్రాసింగ్ సిమెంట్ పరిశ్రమ ఏర్పాటుకు చంద్రబాబు ప్రభుత్వం అనుమతులు, లైమ్ స్టోన్ మైనింగ్ లీజు అనుమతులు ఇచ్చారు. వైసీపీ ప్రభుత్వం వచ్చాక 2022 సెప్టంబరులో చంద్రబాబు మొదలు పెట్టిన రాంకో సిమెంట్ పరిశ్రమను ప్రారంభించారు. అయితే.. చంద్రబాబు ప్రభుత్వంలో ఒప్పందం చేసుకున్న మిగిలిన రెండు పరిశ్రమలకు ఐదేళ్లలో కనీసం పునాది రాయి కూడా వేయలేదు.



ఓర్వకల్లు విమానాశ్రయాన్ని 2019 జనవరిలో జాతీ అంకితం చేసిన నాటి సీఎం చంద్రబాబు

చంద్రబాబు అభివృద్ధి ముద్ర

- ఓర్వకల్లు పారిశ్రామక వాడలో పెట్టుబడులు పెట్టేందుకు పారిశ్రామికవేత్తలు రావాలంటే విమానయాన సౌకర్యం ఉండాలనే అక్ష్యంగా గత టీడీపీ ప్రభుత్వంలో నాటి సీఎం చంద్రబాబు 1,010 ఎకరాల విస్తీర్ణంలో కర్నూలు (ఓర్వకల్లు) గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్టు నిర్మాణానికి 2017 జూన్‌లో శంకుస్థాన చేశారు. రూ.110 కోట్లు వ్యయం చేపట్టిన ఈ విమానాశ్రయంను ఏడాదిన్నరలో పూర్తి చేసి 2018 డిసెంబరు 31న టర్బో విమానంతో ట్రయల్ రన్ నిర్వహిస్తే విజయవంతమైంది. 2019 జనవరిలో చంద్రబాబు జాతికి అంకితం చేశారు. అదే ఏడాది ఏప్రిల్, మే నుంచి కర్నూలు నుంచి విజయవాడకు నడిపేందుకు సన్నాహాలు చేపట్టారు. జగన్ ప్రభుత్వం వచ్చాక పైపై మెరుగులు దిద్ది.. అక్కడక్కడా రంగులు వేసి ఆయన తండ్రి వైఎస్ విగ్రహం పెట్టి ఎయిర్‌పోర్టును తామే నిర్మించినట్లు బిల్డప్ ఇస్తున్నారని ప్రజలు విమర్శిస్తున్నారు.
- ఓర్వకల్లు మండలం పాలకొలను, కుప్పలపాడు, ఉయ్యాలవాడ గ్రామాల్లో డిఫెన్స్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్ (డీఆర్‌డీఓ) చంద్రబాబు ప్రభుత్వంలో ఏర్పాటు చేశారు. ఆ ప్రాజెక్టు కోసం 2,295 ఎకరాల భూములు కేటాయించారు. రూ.500 కోట్లతో ఐదు వేల మందికి ఉపాధి కల్పించాలన్నది లక్ష్యం. 2019 సెప్టంబరు 12న అత్యాదునిక క్షిపణిని పరీక్షించి డీఆర్‌డీఓ సక్సెస్ సాధించింది. రక్షణ శాఖ ఆధ్వర్యంలో యుద్ధ సామగ్రికి అవసమరైన క్షిపణులు, యుద్ధ ట్యాంకులు, మిస్సైల్, గన్స్ వంటివి ఇక్కడ తయారు చేస్తారు. కీలకమైన డీఆర్‌డీఓ ఇక్కడికి రావడాన్ని చంద్రబాబు సాధించిన ఘనతగా చెప్పవచ్చు.
- ఆలూరు, పత్తికొండ నియోజకవర్గాల్లో విండ్ పవర్ (గాలిమర) విద్యుత్ ఉత్పత్తికి శ్రీకారం చుట్టారు. వేలాది మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి దొరుకుతోంది.

నేడు నీట్ ప్రవేశ పరీక్ష

- కర్నూలులో 7 పరీక్ష కేంద్రాలు

కర్నూలు(ఎడ్యుకేషన్), మే 4: వైద్య, విద్య కళాశాలలో ప్రవేశాల కోసం నిర్వహించే నీట్ ప్రవేశ పరీక్షకు సర్వం ఏర్పాట్లు సిద్ధం చేశారు. ఎన్‌టీఏ ఆధ్వర్యంలో ఆదివారం నీట్ ప్రవేశ పరీక్ష మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5:20 గంటల వరకు జరుగుతుంది. అభ్యర్థులను ఉదయం 11 గంటల నుంచి పరీక్ష కేంద్రాల్లోనికి అనుమతి ఇస్తారు. మధ్యాహ్నం 1:30 గంటల తర్వాత ఒక్క నిమిషం ఆలస్యమైనా అభ్యర్థులను పరీక్ష కేంద్రాల్లోనికి అనుమతించరు. పరీక్ష కేంద్రంలోకి వెళ్లేటప్పుడు అభ్యర్థులు హాల్ టికెట్‌తో పాటు రెండు ఫొటోలు, వికలాంగుల అభ్యర్థులైతే పీజికల్ హ్యాండ్ సర్టిఫికెట్ ధృవీకరణ పత్రాన్ని తప్పకుండా తీసుకువెళ్లాలి. కర్నూలు నగరంలో మొత్తం 7 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు.

ఓటరు స్లిప్‌లను పంపిణీ చేయండి : కలెక్టర్

కర్నూలు(కలెక్టరేట్), మే 4: ఓటర్ స్లిప్పుల పంపిణీ ఈ నెల 7వ తేదీ నాటికి పూర్తి చేయాలని అధికారులను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డా.జి. సృజన ఆదేశించారు. శనివారం పోస్టల్ బ్యాలెట్ ఫెసిలిటేషన్ సెంటర్ హోం ఓటింగ్, వెబ్ కాస్టింగ్, ఈవీఎం కమిషనింగ్, ఓటర్ స్లిప్‌ల పంపిణీ తదితర అంశాలపై రిటర్నింగ్ అధికారులతో కలెక్టర్ టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 6, 7, 8 తేదీల్లో పోస్టల్ బ్యాలెట్ ఫెసిలిటేషన్ సెంటర్లు నిర్వహిస్తున్నామనే విషయాన్ని వివిధ వాట్సాప్ గ్రూపుల్లో పోస్టు చేయడంతో పాటు బల్క్ ఎస్ఎంఎస్ రూపంలో అన్ని రకాల ఎన్నికల విధులు నిర్వహిస్తున్న పోలింగ్ సిబ్బందికి పంపించాలని ఆర్వోలను ఆదేశించారు. జిల్లాలో వంద శాతం వెబ్ కాస్టింగ్ అమలు చేస్తామని అన్నారు. ఈ నెల 10వ తేదీ నాటికి సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. 9, 10, 11 తేదీలలో పెద్ద ఎత్తున స్వీప్ యాక్టివిటీ కార్యక్రమాలను నిర్వహించాలన్నారు. ఈ టెలి కాన్ఫరెన్స్‌లో పాణ్యం ఆర్వో, జేసీ నారపురెడ్డి మౌర్య, ఆర్వోలు భార్గవ్‌తేజ, శివ్ నారాయణ శర్మ, శేషిరెడ్డి, రామలక్ష్మి, చిరంజీవి, మురళి, రాము నాయక్, నోడల్ అధికారులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా కర్నూలు పార్లమెంటరీ స్థానానికి సంబంధించి రెండో ఈవీఎం ర్యాండమైజేషన్ పూర్తయిందని రాజకీయ పార్టీ ప్రతినిధులకు కలెక్టర్ సృజన తెలిపారు.

40 ఏళ్ల తర్వాత కురువలకు అవకాశం

- సాగు నీరు, పారిశ్రామిక రంగాలపై దృష్టి
- టీడీపీ ఎంపీ అభ్యర్థి బస్తిపాటి నాగరాజు



మాట్లాడుతున్న బస్తిపాటి నాగరాజు



పంచలింగాల పెద్దలతో సమావేశమైన ఎంపీ అభ్యర్థి నాగరాజు

మద్దికెర, మే 4: తెలుగుదేశం పార్టీ పుణ్యాన 40 ఏళ్ల తర్వాత కురువలకు ఎంపీగా పోటీ చేసే అవకాశం వచ్చిందని కర్నూలు పార్లమెంటు ఎంపీ అభ్యర్థి బస్తిపాటి నాగరాజు అన్నారు. శనివారం మద్దికెర టీడీపీ కార్యాలయంలో కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఎమ్మెల్యే అభ్యర్థి కేఈ శ్యాంబాబుతో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. అనంతరం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ జగన్ విధ్వంస పాలనతో రాష్ట్రాన్ని అథోగతి పట్టించారన్నారు. జగన్‌ను ఇంటికి పంపించే సమయం వచ్చిందన్నారు. నవరత్నాలు, పథకాల పేరుతో రాష్ట్రంలో రూ.15 లక్షల కోట్లు అప్పులు చేసి రాష్ట్రాన్ని అప్పులపాల్జేశారని విమర్శించారు. పేదలను ధనికులను చేసేలా టీడీపీ కూటమి మేనిఫెస్టో ఉందన్నారు. రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే.. చంద్రబాబు ముఖ్యమంత్రి కావాలని అన్నారు. తనను గెలిపిస్తే కర్నూలు జిల్లాలోని సాగునీరు, పారిశ్రామిక రంగాలపై ప్రత్యేక దృష్టి సారించి అభివృద్ధి చేసి చూపిస్తానని అన్నారు. జిల్లాలోని బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీల ఐక్యతతో విజయం సాధిస్తానని అన్నారు. వైసీపీ మేనిఫెస్టోలో పస లేదని, పాత మేనిఫెస్టోనే యధావిధిగా పెట్టారన్నారు. యువతకు ఉపాధి దొరకాలంటే టీడీపీతోనే సాధ్యమన్నారు. జిల్లాలోని కురువలు, యాదవులు అంతా ఒక్కటేనని, వారితోపాటు బీసీ, ఎస్సీ, ఎస్టీలను అభివృద్ధి చేస్తానన్నారు. ముస్లింలకు కూడా న్యాయం జరగాలంటే టీడీపీతోనే సాధ్యమన్నారు. ఈ సందర్భంగా కురువల ఆరాధ్యదేవుడైన బీరప్పస్వామి దేవాలయంలో ఆయన పూజలు చేశారు. ఎంపీగా గెలిచాక దేవాలయం అభివృద్ధికి సాయం చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ సభ్యులు శ్రీనివాసులు, పురుషోత్తం చౌదరి, రాజన్న యాదవ్, ధనుంజయుడు, మండల టీడీపీ అధ్యక్షుడు శివప్రసాద్ యాదవ్, ఎన్. లక్ష్మీనారాయణ, రామాంజులు, నెట్టికంటి నాగరాజు, రఘు యాదవ్, కిష్టన్న, తదితరులు ఉన్నారు.

నాగరాజును గెలిపిస్తాం : పంచలింగాల గ్రామస్థులు

కర్నూలు(రూరల్), మే4: కర్నూలు పార్లమెంటు టీడీపీ ఎంపీ అభ్యర్థి బస్తిపాటి నాగరాజును గెలిపిస్తామని పంచలింగాల గ్రామస్థులు వెల్లడించారు. శనివారం నాగరాజు తన సొంత ఊరు పంచలింగాల గ్రామపెద్దలు రాజశేఖర్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ ఆదామ్, నారాయణ, నాగన్న, కృపాదానం, గొల్లకృష్ణ, సుధాకర్, నాగన్న, లక్ష్మయ్యలతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామపెద్దలు మాట్లాడుతూ గ్రామంలో అందరం నాగరాజుకు మద్దతుగా నిలిచి ఆయనను గెలిపించుకుంటామని అన్నారు. అనంతరం నాగరాజు మాట్లాడుతూ తనకు అండగా నిలిచిన గ్రామ ప్రజలకు, పెద్దలకు ధన్యవాదాలు తెలిపారు.

నేడు ఆదోనికి కేంద్ర మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ రాక



ఏర్పాట్లపై డీఎస్పీతో మాట్లాడుతున్న ఎన్డీయే కూటమి నాయకులు

ఆదోని, మే 4: ఎన్నికల ప్రచారంలో భాగంగా కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఆదివారం ఆదోనికి వస్తున్నారు. మధ్యాహ్నం 2:30 గంటలకు ప్రత్యేక హెలికాప్టర్‌లో ఆర్ట్స్ కళాశాలకు ఆయన చేరుకుంటారు. అక్కడి నుంచి ప్రత్యేక వాహనంలో జిమ్ సర్కిల్, తిక్కస్వామి దర్గా, ఎమ్మిగనూరు సర్కిల్ వరకు రోడ్ షో నిర్వహిస్తారు. భీమాస్ సర్కిల్ వరకు పాదయాత్రగా నిర్వహిస్తారు. సాయంత్రం 4:30 గంటలకు ఎన్డీఏ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి పార్థసారథి, టీడీపీ ఎంపీ అభ్యర్థి పంచలింగాల నాగరాజు గెలుపు కోసం ప్రచారం నిర్వహిస్తారు. ఈ మేరకు రాజ్‌నాథ్‌సింగ్ పర్యటన ఏర్పాట్లను శనివారం డీఎస్పీ శివనారాయణ స్వామితో పాటు టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి, ఎన్డీఏ కూటమి అభ్యర్థి పార్థసారథి తదితరులు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ఖజానాను సీఎం జగన్ మోహన్ రెడ్డి ఖాళీ చేసి, అభివృద్ధిని దూరం చేశాడన్నారు. సీఎం జగన్మోహన్ రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే సాయిప్రసాద్ రెడ్డి ఆదోని నియోజకవర్గానికి ఇచ్చిన హామీలలో ఒక్కటేనా నెరవేర్చారా అంటూ నిలదీశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఉమాపతి నాయుడు, గుడిసె కృష్ణమ్మ, దేవేంద్రప్ప, వెంకటేష్ చౌదరి, శ్రీకాంత్ రెడ్డి, జనసేన మల్లప్ప, రంగన్న, రామస్వామి, నాగరాజు పాల్గొన్నారు.

మద్యంపై నేతల కన్ను

- మందుకు మహా డిమాండ్
- పోలింగ్‌కు సమీపిస్తున్న గడువు
- లిక్కర్ నిల్వలకు ఇప్పటికే ఏర్పాట్లు
- ఎక్కువ మొత్తంలో కొనుగోళ్లకు ప్రయత్నాలు



ఆదోని, మే 4: ఈనెల 13న శాసనసభ ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో మద్యం పంపిణీపై నేతలు దృష్టి సారించారు. ప్రచారంలో భాగంగా సభలు, సమావేశాలు జరిగినప్పుడు మద్యం కీలకం కావడంతో ఆ ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. నియోజకవర్గంలోని మద్యం షాపులు, బెల్టు షాపుల నుంచి కొనుగోలు చేసి నిల్వ చేసుకుంటున్నారు. ప్రచారంలో భాగంగా మద్యం ఎక్కువగా ఉపయోగించనుండటంతో అన్ని పార్టీల నేతలు దీనిపైనే దృష్టి పెట్టారు. దీంతో షాపుల యజమానులు కూడా ఖరీదుకంటే ఎక్కువ మొత్తంలో తీసుకుంటున్నారు.

● లిక్కర్ వినియోగమే అధికం....

ఎన్నికల ప్రచారంలో భాగంగా ప్రతిసారి మద్యం వినియోగం ఎక్కువగా జరుగుతోంది. శాసనసభ ఎన్నికల్లో మద్యం వినియోగం పెరగడం వల్ల అమ్మకాలు కూడా జోరందుకున్నాయి. ప్రతి ఎన్నికల్లో నెలరోజుల పాటు సగటున జరిగే అమ్మకాల కంటే 20నుంచి 30శాతం ఎక్కువగా జరుగుతాయి.

● బెల్టు షాపులతో..

ఈ ఎన్నికల్లో మద్యం షాపులతో పాటు బెల్టుషాపులు నేతలకు కలిసి వస్తున్నాయి. ముందే మద్యం నిల్వల కోసం అన్ని ఏర్పాట్లు చేసుకుంటున్న అభ్యర్థి వీరితో ఒప్పందాలు చేసుకుంటున్నారు. వారికి కావాల్సిన మద్యం కర్ణాటక ప్రాంతాల నుంచి ముందు జాగ్రత్త చర్యగా రాత్రికి రాత్రే ప్రత్యర్థుల మధ్య నియోజకవర్గాలకు సరఫరా చేస్తున్నట్లు సమాచారం. పట్టుబడితే ఏదో ఒక మద్యం కేసుల్లో ఉన్న వ్యక్తిని ఏర్పాటు చేసి అతనిపై కేసు పెట్టుకోవాలంటూ అధికార పార్టీ నాయకులు పోలీసులకు హుకుం జారీ చేస్తున్నట్లు పేరు చెప్పని ఓ ఎక్సైజ్ పోలీసు అధికారి తెలిపారు. కర్ణాటక నుంచి వచ్చిన మద్యాన్ని ఎన్నికల సమయంలో జరిగే ప్రచారాల కోసం వినియోగించుకునేందుకు సిద్ధమవుతున్నారు. ఎన్నికల గడువు కూడా ఎక్కువగా లేకపోవడంతో ఇప్పటికే అభ్యర్థులు మద్యం నిల్వల ఏర్పాట్లు చేసుకున్నారు. ఎన్నికల రోజుకు మూడు రోజుల ముందే మద్యం షాపులను బంద్ చేయనుండటంతో ముందస్తుగానే మద్యం సేకరణకు చర్యలు చేపట్టారు. దీంతోపాటు ఎన్నికల్లో ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు మద్యంతోపాటు నగదు కూడా ఎక్కువ మొత్తంలో అవసరాన్ని కాబట్టి ఇప్పటి నుంచే అందుబాటులో ఉంచేందుకు సిద్ధం చేసుకుంటున్నారు.

చాయ్‌వాలా



కర్నూలు టీడీపీ అభ్యర్థి టీజీ భరత్ వినూత్న రీతుల్లో ప్రచారం నిర్వహిస్తూ ప్రజలను ఆకట్టుకుంటున్నారు. ఇందులోభాగంగానే శనివారం నగరంలోని మార్కెట్‌యార్డులో పర్యటించారు. హోల్‌సేల్, రిటైల్ దుకాణదారులు, కూరగాయల వ్యాపారులు, మార్కెట్‌కు వచ్చిన వారిని పలకరించారు. అనంతరం వెంకటరమణ కాలనీలోని పార్కులో వాకర్స్‌తో మాట్లాడారు. అక్కడే ఉన్న టీ కోట్టులో చాయ్ తయారు చేసి అందర్నీ ఆకర్షించారు. అనంతరం పెద్దలు, యువకులతో మాట్లాడి టీడీపీని గెలిపించాలని కోరారు. - కర్నూలు అర్బన్

చెంచులకు భరోసా



శ్రీశైలం టీడీపీ అభ్యర్థి బుడ్డా రాజశేఖరరెడ్డి ప్రచారం పర్వాన్ని ముమ్మరంగా సాగిస్తున్నారు. అన్ని వర్గాల ప్రజలతో మమేకమై టీడీపీని గెలిపించాలని కోరుతున్నారు. ఇందులోభాగంగానే శనివారం ఆత్మకూరు మండలంలో బైర్లూటి గ్రామంలో పర్యటించారు. స్థానిక చెంచు మహిళలతో కలిసి కింద కూర్చున్న ఆయన వారు చెప్పే సాదకబాదకాలను ఓపిగ్గా విన్నారు. టీడీపీ అధికారంలోకి వస్తే సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. మీకు అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. -ఆత్మకూరు

చెప్పులు కుడుతూ..



ఎన్నికల ప్రచార పర్వంలో ఓటర్లను ఆకట్టుకునేందుకు అభ్యర్థులు పడరాని పాట్లు పడుతున్నారు. ఎన్నికలను సవాల్‌గా తీసుకున్న నేతలు ఓటర్లను ఆకట్టుకునేలా తమ ప్రచారాన్ని సాగిస్తున్నారు. తాజాగా నంద్యాల పార్లమెంట్ స్థానం నుంచి కాంగ్రెస్ పార్టీ తరఫున బరిలో ఉన్న జె.లక్ష్మీనరసింహ యాదవ్ చెప్పులు కుడుతూ ఓటర్లను ఆకట్టుకున్నారు. నంద్యాల పార్లమెంట్ పరిధిలోని బనగానపల్లె పట్టణంలో శనివారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అందులో భాగంగా పట్టణంలోని ఓ దళితుడి వద్దకు వెళ్లి దాదాపు అరగంట సేపు ఇలా ప్రజల పాదరక్షలు కుడుతూ ఓటర్లను ఆకర్షించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే రాష్ట్రానికి ప్రత్యేక హోదాపైనే రాహుల్‌గాంధీ సంతకం చేస్తారని ఎంపీ అభ్యర్థి లక్ష్మీనరసింహయాదవ్ చెప్పుకొచ్చారు. - బనగానపల్లె

లాక్కునే చట్టం



- కర్నూలు కలెక్టరేట్


వైసీపీ ప్రభుత్వం తీసుకువచ్చిన ల్యాండ్ టైటిలింగ్ యాక్టుపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఏపీ ల్యాండ్ టైటిలింగ్ యాక్టు-2023 పైన రాష్ట్రంలోని న్యాయవాదులు కూడా నిరసన వ్యక్తం చేశారు. భూహక్కు చట్టం - ఏపీ ల్యాండ్ టైటిలింగ్ యాక్టు 27ను జీవో 512 ద్వారా అక్టోబరు 31 నుంచి అమలు చేశారు. రాష్ట్రంలోని ప్రజలు స్థిరాస్థులు, భూమి వివాదాలు పరిష్కార కోసం సివిల్ కోర్టులకు వెళ్లకుండా ఆ స్థానంలో ట్రిబ్యునల్ కోర్టు ద్వారా పరిష్కారం చేసుకోవచ్చని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. దీంతో ప్రజల నుంచి తీవ్ర అభ్యంతరం వ్యక్తమవుతోంది.

● ల్యాండ్ టైటిలింగ్ యాక్టు అమలుపై విమర్శలు ● వైసీపీ ప్రభుత్వంపై ప్రజల ఆగ్రహం

టైటిల్ రిజిస్ట్రేషన్ చేసుకున్న వ్యక్తికే ఆ భూమిని పూర్తిగా విక్రయించే అధికారం ఉంటుంది. ఒకవేళ భూమిపై వివాదం ఉంటే టైటిల్ రిజిస్టర్‌లో పేరు నమోదైన రెండేళ్లలోపు వివాదంపై కేసు నమోదు అవకాశం ఉంటుంది. ఆ కేసు జిల్లా స్థాయిలో ల్యాండ్ టైటిలింగ్ అధికారులు లేదా జాయింట్ కలెక్టర్ వద్ద కేసు దాఖలు చేయాలి.

6 నెలల పాటు జైలు, రూ.50 వేల జరిమానా


లేదంటే ఆ భూమిని శాశ్వత భూ యజమాని కోల్పోతాడు. సమస్య పరిష్కారమయ్యే వరకు భూముల క్రయవిక్రయాలు జరగవు. సదరు భూముల్లో నిర్మాణాలు చేపట్టడానికి వీలు లేదు. రికార్డు ప్రకారం భూమిని నమోదు చేసుకుని సమాచారం తప్పని రుజువైతే.. ఆరు నెలల పాటు జైలు శిక్ష రూ.50 వేలు జరిమానా విధిస్తారు.



ఓల్డ్ పాసు పుస్తకం

● ఏపీ ల్యాండ్ అథారిటీ

రాష్ట్రంలో ప్రత్యేక ప్రధాన కార్యదర్శి స్థాయి నేతృత్వంలోని ఏపీ ల్యాండ్ అథారిటీ పని చేస్తుంది. ఏపీ ల్యాండ్ అథారిటీ కేంద్రం టైటిల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్ (డీఆర్‌వో), మండల స్థాయిలో ల్యాండ్ టైటిలింగ్ అప్పిలేట్ అధికారి (ఎల్‌టీవో) ఉంటారు. రికార్డు ఆఫ్ టైటిల్స్‌లో ఒకసారి యజమాని పేరు నమోదు చేశాక.. రెండేళ్లలోపు ఎవరూ అభ్యంతరం చెప్పకపోతే ఆ యజమాని భూహక్కుదారు అవుతారు.



● సెక్షన్-7 ప్రకారం నమోదు చేసుకోవాలి:

రాష్ట్రంలోని ప్రజలందరూ ఆస్తి వివరాలు, వివాద స్థిరాస్థులు, భూములను సెక్షన్ 7 ప్రకారం తప్పనిసరిగా టైటిల్ రిజిస్ట్రేషన్ వద్ద నమోదు చేసుకోవాలి.



● 30 రకాల రికార్డులు కనుమరుగు:

భూ హక్కు చట్టం-ఏపీ ల్యాండ్ టైటిలింగ్ యాక్టు-2023 వల్ల ఇప్పటి వరకు భూములకు ఉన్న పాసు పుస్తకం, టైటిల్ డీడ్, అడంగల్, 1బీ లాంటి 30 రకాల రికార్డులు కనుమరుగవుతాయని అధికారులు చెబుతున్నారు.

రైతుల ఆందోళన

ఈ చట్టం ప్రకారం ఆస్తులపై సివిల్ కోర్టులో కాకుండా ట్రిబ్యునల్ కోర్టులో పిటీషన్ దాఖలు చేయాలి. ఒకవేళ ట్రిబ్యునల్ కోర్టులో న్యాయం జరగని పక్షంలో హైకోర్టుకు వెళ్లాలి. ప్రతి రైతు హైకోర్టుకు వెళ్లారన్నది ప్రశ్నార్థకమే. వైసీపీ ప్రభుత్వం రైతులపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతుందన్న దానికి ఇది ఒక నిదర్శనమనే రైతులు స్పష్టం చేస్తున్నారు.



● భూ కబ్జాలకు అవకాశం

ఈ చట్టం కబ్జాలకు పాల్పడే వ్యక్తులు, కార్పొరేట్లకు భూములు ధారాదత్తం చేసేవిధంగా వైసీపీ ప్రభుత్వం రూపొందించిందని పలువురు అభిప్రాయ పడుతున్నారు. చిన్న, సన్నకారు రైతులు, దళిత గిరిజన భూములను మోసం చేయడానికి ఈ భూహక్కు చట్టాన్ని వైసీపీ ప్రభుత్వం తీసుకవచ్చిందని ప్రజా సంఘాల నాయకులు, విద్యావేత్తలు, మేధావులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కోర్టుల్లో కేసులు వేయలేని నిబంధనలను అమలు చేడయం పట్ల వైసీపీ ప్రభుత్వం దాష్టీకానికి నిదర్శనమని అభిప్రాయపడుతున్నారు.



● ప్రజా ధనం వృథా

గ్రామాల్లో గ్రామ సచివాలయం అధికారులు జగనన్న భూసర్వే చేపట్టారు. భూసర్వే చేసిన చాలా గ్రామాల్లో ఇప్పటికి సరిహద్దు రాళ్లు పాతలేదు. భూ సమస్యలను పరిష్కరించలేదు. పట్టాదారు పుస్తకంలో భూ యజమాని ఒకరైతే.. ఫొటో మరొకరిది ప్రచురిస్తున్నారు. అంతా తప్పుల తడకగా ఉంది. రైతులు చాలా మంది నిరక్షరాస్యులు ఉన్నారు. వైసీపీ ప్రభుత్వం తెచ్చిన ల్యాండ్ టైటిలింగ్ యాక్టు వల్ల రైతులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉంది. వివాదాలు పరిష్కారం కాకపోతే హైకోర్టుకు రైతులు వేళ్లే పరిస్థితి లేదు.

- రవి, రైతు

ఎన్నికల విధుల్లో బాధ్యతగా ఉండండి

● స్పెషల్ పోలీస్ అబ్జర్వర్ దీపక్ మిశ్రా


మాట్లాడుతున్న పోలీస్ స్పెషల్ అబ్జర్వర్ దీపక్ మిశ్రా

కర్నూలు(కలెక్టరేట్), మే 4: ఎన్నికల్లో నిష్పక్షపాతంగా వ్యవహరించడంతోపాటు ఎన్నిల విధుల పట్ల బాధ్యతగా ప్రవర్తించాలని పోలీసు స్పెషల్ అబ్జర్వర్ దీపక్‌మిశ్రా పోలీసు అధికారులను సూచించారు. శనివారం కలెక్టరేట్ మినీ వీడియో కాన్ఫరెన్స్ హాల్లో సాధారణ ఎన్నికల నిర్వహణ, భద్రతా చర్యలపై స్పెషల్ పోలీస్ అబ్జర్వర్ దీపక్ మిశ్రా, అదనపు డీజీ (లా అండ్ ఆర్డర్) శంఖబ్రత బాగ్చి సమావేశం నిర్వహించారు. సమావేశంలో జనరల్ అబ్జర్వర్ జాఫర్ మీర్ తారీఖ్ అలి, జిల్లా కలెక్టర్ డా.జి.సృజన పోలీసు పరిశీలకులు ఉమేష్ కుమార్, ఎస్పీ జి.కృష్ణకాంత్, ఎన్నికల వ్యయ పరిశీలకులు రాకేష్ బడాదియా పాల్గొన్నారు. సమావేశంలో కర్నూలు రేంజ్ డీఐజీ సీహెచ్ విజయరావు, అడిషనల్ ఎస్పీ నాగరాజు, ఎస్‌డీపీవోలు పాల్గొన్నారు.

రెండోసారి ఈవీఎం ర్యాండమైజేషన్ పూర్తి

కర్నూలు(కలెక్టరేట్), మే 4: కర్నూలు పార్లమెంటరీ స్థానానికి సంబంధించి రెండో ఈవీఎం ర్యాండమైజేషన్ పూర్తి చేశామని రాజకీయ పార్టీ ప్రతినిధులకు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డా.జి.సృజన తెలిపారు. శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జనరల్ అబ్జర్వర్లు, రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో కర్నూలు పార్లమెంటు బ్యాలెట్ యూనిట్లకు రెండో విడత ఈవీఎం ర్యాండమైజేషన్ కార్యక్రమాన్ని కలెక్టర్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ర్యాండమైజేషన్ ప్రక్రియను ఈసీఐ సాఫ్ట్‌వేర్ ద్వారా మూడు రౌండ్లు నిర్వహించి మూడవ రౌండ్‌ను ఫైనల్ చేశామన్నారు. సమావేశంలో జనరల్ అబ్జర్వర్లు జాఫర్ మీర్ తారీఖ్ అలి, అసిస్టెంట్ ట్రైనీ కలెక్టర్ కళ్యాణి, డీపీవో నాగరాజు నాయుడు, రాజకీయ పార్టీల ప్రతినిధులు, అభ్యర్థులు పాల్గొన్నారు.



ఇక వారం రోజులే..!

- దగ్గర పడుతున్న ప్రచారం సమయం
- స్పీడ్ పెంచిన పార్టీలు

నందికొట్కూరు, మే 4: ఎన్నికల ప్రచారానికి ఇంకా వారం రోజులే మిగిలి ఉంది. సమయం దగ్గర పడుతుండడంతో రాజకీయ పార్టీలు స్పీడ్ పెంచాయి. అభ్యర్థులు తమ పార్టీ ప్రకటించిన మేనిఫెస్టో వివరిస్తూ ఓటు వేయాలని కోరుతున్నారు. మేనిఫెస్టోలోని హామీలతో పాటు స్థానికంగా ఉండే సమస్యలను ప్రచారాస్త్రాలుగా చేసుకుని ముందుకు సాగుతున్నారు. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి మేనిఫెస్టో జనరంజకంగా ఉండడంతో అభ్యర్థులు ప్రచారంలో ఉత్సాహంగా కనిపిస్తున్నారు. వైసపీ మేనిఫెస్టో పేలవంగా ఉండడంతో ఆ పార్టీ అభ్యర్థులు డీలా పడుతున్నారు. దీనికి తోడు వైసీపీ ఐదేళ్ల పాలనలో జరిగిన విధ్వంసంపైనే టీడీపీ నాయకులు ప్రధానంగా ఫోకస్ పెట్టి ప్రచారం సాగిస్తున్నారు. ప్రస్తుతం విజయావకాశాలు కూటమికే ఉన్నాయని తెలుస్తుండడంతో వైసీపీ నుంచి టీడీపీలోకి చేరికలు జోరందుకున్నాయి. వారిని ఆపడానికి వైసీపీ నాయకులు ఆపసోపాలు పడుతున్నారు. కూటమి మేనిఫెస్టోలో కీలకమైన ఏటా నాలుగు లక్షల ఉద్యోగాల కల్పనతో పాటు నిరుద్యోగ భృతి వంటి అంశాలపై అభ్యర్థులు దృష్టి సారించారు. ఇవేగాకుండా చంద్రబాబుకు ఉన్న ఐటీ బ్రాండ్‌ను కూడా అభ్యర్థులు లక్ష్యంగా చేసుకుని ప్రచారం చేస్తున్నారు.

పగలు ప్రచారం.. రాత్రి మంతనాలు

అభ్యర్థులు పగలంతా ప్రచారం చేస్తున్నారు. రాత్రి చేరికలు తదితర అంశాలపై మంతనాలు సాగిస్తున్నారు. బూత్‌ల వారీగా సమీక్షలతో పార్టీ కార్యాలయాలు, అభ్యర్థుల ఇళ్లు జాతరను తలపిస్తున్నాయి. మధ్యమధ్యలో ప్రధాన పార్టీల తరపున రాష్ట్ర స్థాయి నాయకులు ప్రచారానికి వచ్చి వెళ్తుండడంతో ఆయా పార్టీల శ్రేణుల్లో గెలుపు ధీమా మరింత పెరుగుతోంది.





● కూటమి అధికారంలోకి వస్తే..

తాము అధికారంలోకి వస్తే ఏళ్లగా పరిష్కారం లభించని అనేక సమస్యలకు పరిష్కారం దొరుకుతుందని కూటమి నాయకులు హామీ ఇస్తున్నారు. కొద్ది రోజుల కిందట వరకు పార్టీ అభ్యర్థి మాత్రమే ప్రచారం చేసేవారు. ప్రస్తుత సమయం దగ్గర పడుతుండడంతో పార్టీలో ద్వితీయ శ్రేణి నాయకులకు గ్రామాల వారీగా ప్రచార బాధ్యతలను అప్పగించారు. ప్రచారంలో భాగంగా ఇప్పటి వరకు టచ్ చేయని ప్రాంతాలపై దృష్టి పెట్టడంతో పాటు, ప్రతికూలత ఉన్న ప్రాంతాల్లో ఎక్కువగా ప్రచారం చేయాలని నాయకులు అంచనాకు వచ్చారు. పార్టీ తరపున నియోజకవర్గాల్లో ఉన్న పరిశీలకుల సూచనలు, సలహాలు కూడా పాటిస్తూ అభ్యర్థులు దూకుడు పెంచారు.



● సోషల్ మీడియాపైనా దృష్టి..

సమయం తక్కువగా ఉండడంతో కోడ్ నిబంధనల మేరకు సోషల్ మీడియాలో ప్రచారంపై కూడా నాయకులు దృష్టి సారించారు. ఇందుకోసం ప్రత్యేకంగా ఓ బృందాన్ని కొంత మంది అభ్యర్థులు ఏర్పాటు చేసుకున్నారు. సోషల్ మీడియాలో ఎక్కువగా యువతను ఆకట్టుకునే అంశాలపై దృష్టి సారించారు.

● ముఖ్య నేతల తాకిడి

ఎన్నికల తేదీ సమీపిస్తున్న కొద్దీ జిల్లాకు ప్రచారాని వచ్చే రాష్ట్రస్థాయి నేతల తాకిడి ఎక్కువైంది. ఇటీవల నందికొట్కూరులో టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు, బాలకృష్ణ, కాంగ్రెస్ అధ్యక్షురాలు షర్మిలా రెడ్డిలు రోడ్డు షోలు నిర్వహించారు. ఈ వారంలో తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి, జగన్మోహన్‌రెడ్డి పర్యటన ఉంటుందన్న ప్రచారం జరుగుతోంది. అయితే తేదీలు ఖరారు కావాల్సి ఉంది.

● కూడికలు, తీసివేతలతో బిజీబిజీ..

అభ్యర్థులు ప్రచారంలో తలమునకలై ఉన్నారు. వారి వారి పార్టీలు నియోజకవర్గాల వారీగా నియమించిన పరిశీలకులు పంచాయతీలు, బూత్‌లు వారీ బలాబలాలను లెక్కలు వేస్తున్నారు. ప్రతి రోజూ నియోజకవర్గంలో పార్టీ పరిస్థితిపై అధిష్టానానికి నివేదిక ఇస్తున్నారు. పరిశీలకులు అభ్యర్థులతో సమానంగా పని చేస్తూ వారి గెలుపు కోసం తెరవెనుక వ్యూహాలు రచించే పనిలో నిమగ్నమయ్యారు.



గుంతలు పడిన మద్దికెర-బురుజుల రోడ్డు

అడుగుకో గుంత..

- ప్రయాణమంటే చింత
- భూమి పూజకే పరిమితమైన వైసీపీ

మద్దికెర, మే 4: గడిచిన ఐదేళ్ల పాలనలో గ్రామీణ రహదారులు అధ్వానంగా మారాయి.. అడుగుకో గుంతతో ప్రయాణికులు ఇబ్బందిపడుతున్నారు. వాటికి మరమ్మతుల పేరుతో రూ.36 లక్షల నిధులు మంజూరు చేయించుకుని తూతూ మంత్రంగా మరమ్మతులు పనులు చేసి వదిలేశారన్న ఆరోపణలు ఉన్నాయి. మద్దికెర నుంచి బురుజుల మీదుగా పత్తికొండకు వెళ్లే రోడ్డు సుమారు 10 కి.మీ. పొడవునా గుంతలమయమైంది. ఈ రోడ్డుపై ప్రయాణించే సమయంలో ఏమాత్రం అప్రమత్తంగా ఉన్నా ప్రమాదాల బారిన పడాల్సి వస్తోంది. రాత్రివేళల్లో ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని ప్రయాణం చేయాల్సిన దుస్థితి నెలకొంది. వైసీపీ నాయకులు మరమ్మతుల కోసం రూ.46 లక్షలు మంజూరు చేయించుకోగా.. రూ.10 లక్షలు జీఎస్టీ పోగా.. రూ.36 లక్షలు బిల్లులు చేసుకుని కాజేశారు. బురుజుల నుంచి మద్దికెర నంచర్ల సరిహద్దు వరకు రూ.5 కోట్లు మంజూరు చేయగా.. వైసీపీ నాయకులు అట్టహాసంగా భూమి పూజ చేశారు. కాంట్రాక్టు పొందిన సదరు వ్యక్తి తూతూ మంత్రంగా రోడ్డుకిరువైపులా ముళ్లకంపలను తొలగించారే తప్ప.. పనిమాత్రం ఇంత వరకు చేయలేదు. ఎమ్మెల్యే కె.శ్రీదేవి మాత్రం రోడ్డు కోసం నిధులు మంజూరు చేశామని చెప్పుకొంటున్నారు. దీంతో బురుజుల, మద్దికెర, నెంచర్ల రోడ్డు అధ్వానంగా తయారు అయ్యాయని అనడంలో ఎటువంటి సందేహం లేదు..

● మరమ్మతుల పేరుతో కాజేశారు



మద్దికెర నుంచి బురుజుల వరకు మరమ్మతుల పేరుతో నిధులు కాజేశారు. పాలకులు హామీలు ఇస్తారే తప్ప.. ఇంత వరకు రోడ్డు వేయలేదు. ఆ రహదారి గుండా వెళ్లలేక పత్తికొండ నుంచి వయా తుగ్గలి పెరవలి మీదుగా మద్దికెరకు చేరుకుంటున్నారు. ఇప్పటికైనా పాలకులు భూమి పూజలకే పరిమితం కాకుండా వెంటనే పనులు చేయాలి.

\- చంద్రమోహన్, మద్దికెర



అధ్వానంగా ఉన్న మద్దికెర-నెంచర్ల రోడ్డు



చేనేత పురి ఎవరిదో..?

- ఆవిర్భావం నుంచి టీడీపీకి కంచుకోట ● ఈసారి బీవీ, బుట్టా రేణుక మధ్య పోటీ



కర్నూలు, మే 4 (ఆంధ్రజ్యోతి)/ ఎమ్మిగనూరు:

ఎమ్మిగనూరులో ఈసారి ఎవరు విజేత అవుతారనే చర్చ జోరుగా సాగుతోంది. టీడీపీ నుంచి బీవీ జయనాగేశ్వరరెడ్డి, వైసీపీ అభ్యర్థిగా మాజీ ఎంపీ బుట్టా రేణుక పోటీలో ఉన్నారు. టీడీపీ, వైసీపీ మధ్యనే హోరాహోరీ పోరు నడుస్తోంది. 1955లో ఎమ్మిగనూరు అసెంబ్లీ నియోజకవర్గంగా ఏర్పడింది. ఆ ఎన్నికల్లో ద్విసభ్యులుగా కోట్ల విజయభాస్కరరెడ్డి, దామోదరం సంజీవయ్య ఎమ్మెల్యేలుగా అసెంబ్లీలో అడుగు పెట్టారు. ఆ ఇద్దరూ ఉమ్మడి రాష్ట్రానికి ముఖ్యమంత్రులుగా పని చేశారు.

● టీడీపీకి కంచుకోటగా ఎమ్మిగనూరు:

టీడీపీ ఆవిర్భావంతో ఎమ్మిగనూరు ఆ పార్టీకి కంచుకోటగా మారింది. 1983లో ముఖ్యమంత్రి హోదాలో పోటీ చేసిన కోట్ల విజయభాస్కరరెడ్డి ఎమ్మెల్యేగా గెలిచినా రాష్ట్రంలో కాంగ్రెస్ ఓటమికి నైతిక బాధ్యత వహిస్తూ రాజీనామా చేశారు. అదే ఏడాది వచ్చిన ఉప ఎన్నికలో ఎన్టీఆర్ కుటుంబానికి అత్యంత సన్నిహితుడైన బీవీ మోహన్‌రెడ్డి టీడీపీ అభ్యర్థిగా పోటీ చేసి మాజీ ఎమ్మెల్యే కేఆర్ హనుమంతరెడ్డిపై 6,639 ఓట్ల ఆధిక్యంతో విజయం సాధించారు. ఆ గెలుపుతో మొదలైన బీవీ విజయకేతనం 1999 వరకు కొనసాగింది. 1983, 1985, 1989, 1994, 1999 ఎన్నికల్లో వరుసగా ఐదు పర్యాయాలు విజయం సాధించారు. ఎన్టీఆర్, చంద్రబాబు కాబినెట్‌లో ఆరు పర్యాయాలు మున్సిపల్ శాఖ, రోడ్లు భవనాలు.. వంటి కీలకమైన మంత్రి పదవులు చేపట్టారు. ప్రస్తుతం టీడీపీ అభ్యర్థిగా మాజీ ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి బరిలో దిగితే.. వైసీపీ అభ్యర్థిగా బుట్టా రేణుక తొలిసారిగా పోటీ బరిలో దిగారు. పీఠం నీదా.. నాదా అంటూ బీవీ, బుట్టాలు ప్రచారంలో దూకుడు పెంచారు. కాంగ్రెస్ అభ్యర్థిగా ఖాశీంవలీ పోటీ చేశారు.



● నియోజకవర్గ స్వరూపం

- నియోజకవర్గం పరిధిలో ఎమ్మిగనూరు పట్టణం, రూరల్ మండలం, నందవరం, గోనెగండ్ల మండలాలు ఉన్నాయి
- పోలింగ్ కేంద్రాలు : 271
- మొత్తం ఓటర్లు : 2,44,818
- పురుష ఓటర్లు : 1,20,608
- మహిళా ఓటర్లు : 1,24,163
- థర్డ్ జెండర్ : 47



బీవీ బలాలు..

మాజీ ఎమ్మెల్యేగా నియోజకవర్గం ప్రజలకు సుపరిచితుడు కావడం. ఆయన తండ్రి దివంగత మాజీ మంత్రి బీవీ మోహన్‌రెడ్డి చేసిన అభివృద్ధి. చేనేత, ఉప్పర, వాల్మీకి సామాజికవర్గాలు పార్టీకి అండగా ఉండడం, జగన్ ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత.

● బలహీనతలు..:

\- కూటమి పార్టీలైన జనసేన, బీజేపీ నాయకుల మధ్య సమన్వయం లేకపోవడం. సీనియర్లకు సరైన గుర్తింపు ఇవ్వకపోవడం.

బుట్టా రేణుక బలాలు..

తన సామాజికవర్గానికి చెందిన చేనేతల ఓటర్లు ఎక్కువగా ఉండడం.. డబ్బులు విచ్చలవిడిగా ఖర్చు చేస్తుందనే ప్రచారం..

● బలహీనతలు..:

\- నియోజకవరానికి కొత్త కావడం. 2014లో ఎంపీగా నాగులదిన్నె గ్రామాన్ని దత్తత తీసుకున్నా.. ఆ గ్రామంలో చెప్పుకోదగ్గ అభివృద్ధి పనులు చేయకపోవడం. ఎర్రకోట వర్గీయులను దూరం పెట్టడం.

■ పోస్టల్ బ్యాలెట్ వినియోగం ఎలా?



కర్నూలు(న్యూసిటీ), మే 4: సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా ముందుగా నిర్వహించే పోస్టల్ బ్యాలెట్ కోసం రంగం సిద్ధమైంది. 6,7,8 తేదీల్లో పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కు వినియోగించుకునేందుకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ క్రమంలో పోస్టల్ బ్యాలెట్ వినియోగంపై జిల్లా ఎన్నికల అధికారులు పలు సూచనలు చేశారు. ఆయా అసెంబ్లీ పరిధిలో పని చేస్తున్న ఉద్యోగులు ఫెసిలిటేషన్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన ప్రత్యేక కౌంటర్లో పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కు వినియోగించుకోవాల్సి ఉంటుంది.

పోస్టల్ బ్యాలెట్ వినియోగం ఇలా...

- 13-ఏ- డిక్లరేషన్‌లో బ్యాలెట్ పేపర్ సీరియర్ నెంబరు నమోదు చేయవలెను.
- డిక్లరేషన్‌లో ఓటరు తప్పక సంతకం చేయాలి
- డిక్లరేషన్‌పై అటెస్టేషన్ తప్పనిసరిగా చేయాలి
- పోస్టల్ బ్యాలెట్‌పై అభ్యర్థి పేరుకు సంబంధించి ఎంపిక ఇవ్వబడిన స్థలంలో టిక్ (మార్కు) గాని ఇంటూ (ఇంటూ మార్కు) మార్కుగాని పెట్టాలి
- పోస్టల్ బ్యాలెట్‌పై సంతకం, పేర్లు రాయడం చేయకూడదు.
- ఓటు నమోదు చేసిన తర్వాత పోస్టల్ బ్యాలెట్‌ను 13-బీ కవర్‌లో పెట్టి అతికించాలి
- 13-బీ కవర్‌పైన పోస్టల్ బ్యాలెట్ సీరియర్ నెంబర్ తప్పనిసరిగా రాయాలి
- 13-బీ కవర్‌ను, డిక్లరేషన్ 13-సి కవర్‌లో ఉంచి సీల్ వేయాలి
- 13-సీ కవర్‌ను సంబంధిత బ్యాలెట్ బాక్స్‌లో వేయాలి.

■ బీప్ సౌండ్ వస్తేనే ఓటు పడినట్టు..!



కర్నూలు(న్యూసిటీ), మే 4: ఓటర్లు పోలింగ్ బూత్‌లో ఈవీఎం బటన్ నొక్కినప్పుడు బీప్ శబ్దం గమనించాలి. శబ్దం రాకుంటే ఓటు దుర్వినియోగమైనట్లుగా భావించవచ్చు. ఓటర్లు ఈవీఎం శబ్దంపై దృష్టి కేంద్రీకరించి అనుమానం ఉంటే అధికారుల దృష్టికి తీసుకెళ్లాలి. పోలింగ్ బూత్‌లో ముగ్గురు అధికారులు ఉంటారు. మొదటి అధికారి మన వివరాలను పరిశీలించి ఒక స్లిప్ ఇస్తారు. రెండో వారు ఓటరు సంతకం తీసుకుంటారు. మూడో వారు ఓటరు చేతి వేలికి ఇంక్ మార్కు వేస్తారు. ఈ అధికారి వద్దనే ఈవీఎం మాస్టర్ కంట్రోల్ యూనిట్ ఉంటుంది. అదినొక్కినప్పుడే ఈవీఎం యాక్టివేట్ అవుతుంది. అప్పుడు ఓటరు పరదా చాటునున్న ఈవీఎంలో నచ్చిన అభ్యర్థికి ఓటు వేయాలి. బటన్ నొక్కినప్పుడు ఒక శబ్దం వస్తుంది. వెంటనే పక్కనే ఉన్న వీవీ ప్యాట్‌లో ఓటు వేసిన అభ్యర్థి పేరు, పార్టీ వివరాలు డిస్‌ప్లే అవుతాయి. బటన్ నొక్కినప్పుడు శబ్దం రాకపోతే ఓటు పడలేదని అర్థం. మూడో అధికారి ఈవీఎం మోనిటర్ కంట్రోల్ యూనిట్ యాక్టివేట్ చేయలేదని అర్థం చేసుకోవాలి. వెంటనే ప్రశ్నించాలి. ఇది కూడ రిగ్గింగ్‌లో ఓ భాగమే. వృద్ధులు, కొత్త ఓటర్లు ఇది గమనించకుండా పోలింగ్ బూత్ నుంచి వెళ్లిపోతారు. తరువాత బూత్‌లో ఉన్న వారు మన ఓటును దుర్వినియోగం చేస్తారు. వాళ్లకు నచ్చిన వారికి వేసుకుంటారు.

■ కొండమనాయినిపల్లెలో టీడీపీ తొలిసారి ప్రచారం



కొండమనాయినిపల్లెలో కరపత్రాలు పంపిణీచేస్తున్న టీడీపీ నాయకులు ఆకుల నాగిరెడ్డి, శివారెడ్డి తదితరులు

అవుకు, మే 4: ప్రతి ఎన్నికల్లో రిగ్గింగ్, రీసైక్లింగ్ నిర్వహించే అవుకు మండలం కొండమనాయినిపల్లె గ్రామంలో టీడీపీ నాయకులు తొలిసారి ప్రచారం నిర్వహించారు. ఆకుల నాగిరెడ్డి, శివారెడ్డి ఆధ్వర్యంలో నాయకులు శనివారం గ్రామంలో ఇంటింటికీ తిరిగారు. 40 ఏళ్లుగా చల్లా కుటుంబీకుల ఆధిపత్యంలో నడిచిన కొండమనాయినపల్లెలో టీడీపీ అభ్యర్థి బీసీ జనార్దన్‌రెడ్డికి మద్దతుగా టీడీపీ ప్రచారం నిర్వహించి రికార్డు సృష్టించారు. గ్రామంలోని యువకులు భారీగా తరలివచ్చి ప్రజాగళం ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ఇంటింటికీ తిరిగి సూపర్ సిక్స్ కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో రాయలసీమ ఉద్యమ నాయకులు సీమకృష్ణ, టీడీపీ నాయకులు సుబ్బయ్య, చిన్నబాలసుంకన్న, భూపడు, మల్లేశ్‌యాదవ్, రాజశేఖర్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

■ ఆలూరులో వరుస విజేతలు వీరే...



మారెప్ప



జయరాం

దేవనకొండ, మే 4: జిల్లాలో వెనుకబడిన ఆలూరు నియోజకవర్గంలో వరుసగా రెండు సార్లు గెలిచిన ఎమ్మెల్యేల జాబితాలో ఇద్దరు చోటు సంపాదించుకున్నారు. ఒకరు మూలింటి మారెప్ప 1999, 2004 ఎన్నికల్లో గెలిచారు. మరొకరు గుమ్మనూరు జయరాం 2014, 2019 ఎన్నికల్లో ఎమ్మెల్యేగా గెలుపొందారు. ఇందులో విశేషం ఏమిటంటే వరుసగా రెండుసార్లు గెలిచిన వీరిద్దరినీ మంత్రి పదవులు వరించాయి.

సెక్షన్.. తప్పదు యాక్షన్



కర్నూలు, మే 4: ఎన్నికల నియామావళిని ఎవరు అతిక్రమించినా ప్రజాప్రాతినిధ్య చట్టంలోని నిబంధనల ప్రకారం కేసులు నమోదు చేస్తుంటారు. ప్రచారంలో పార్టీల అభ్యర్థులు, నాయకులు, కార్యకర్తలు అదుపుతప్పి వ్యవహరిస్తే దండన తప్పదు. సామాన్య పౌరులు సైతం ఫిర్యాదు చేసినా పోలీసులు కేసులు నమోదు చేసి చర్యలు తీసుకుంటారు. ఈ నేపథ్యంలో కొన్ని ఎన్నికల చట్టాల గురించి అవగాహన పెంచుకోవడం చాలా ముఖ్యం.. అవేమిటంటే..

- **సెక్షన్ 122 :** జాతి, మతం, కులం, సంఘం, భాషను రెచ్చగొట్టేలా వ్యవహరించడం, ఒత్తిడికిలోను చేయడం చేస్తే ఈ సెక్షన్ కింద కేసు నమోదు చేస్తారు.
- **సెక్షన్ 125 :** ఎన్నికల సందర్భంగా వివిధ వర్గాల మధ్య శత్రుత్వాన్ని పెంపొందిస్తే మూడేళ్లపాటు జైలు శిక్ష లేదా జరిమానా ఉంటుంది. ఒక్కో సమయంలో ఈ రెండింటిని కూడా విధించే అవకాశం ఉంది.
- **సెక్షన్ 126:** ఎన్నికల సమయానికి 48 గంటల ముందు బహిరంగ సభలు నిర్వహిస్తే శిక్షార్హులు. దీనికి రెండేళ్ల జైలు లేదా జరిమానా విధిస్తారు.
- **సెక్షన్ 127:** ఎన్నికల సమావేశం సందర్భంగా ఎటువంటి అల్లర్లకు పాల్పడినా నేరుగా పోలీసు అధికారులు ఆ వ్యక్తులను అరెస్టు చేసి కేసు నమోదు చేస్తారు. ఈ సెక్షన్‌కు ఆరు నెలల జైలు శిక్ష, రూ.2 వేల జరిమానా విధిస్తారు.
- **సెక్షన్ 128:** బహిరంగంగా ఓటేసినా మూడు నెలల జైలు లేదా జరిమానా విధిస్తారు.
- **సెక్షన్ 129:** ఎన్నికల అధికారులు, సిబ్బంది, పోలీసులు పోటీ చేసే అభ్యర్థికి సహకరించినా, ప్రభావం కలిగించినా శిక్షార్హులు. ఇందుకు మూడు నెలలు జైలు శిక్ష లేదా జరిమానా ఉంటుంది.
- **సెక్షన్ 130:** పోలింగ్ స్టేషన్‌కు వంద మీటర్ల లోపల ప్రచారం చేయకూడదు. ఒకవేళ చేస్తే ఈ సెక్షన్ కింద జైలు శిక్షతోపాటు జరిమానా విధిస్తారు.
- **సెక్షన్ 131:** పోలింగ్ కేంద్రానికి సమీపంలో నియమాలకు వ్యతిరేకంగా ప్రచారం చేస్తే ఏ పోలీసు అధికారైనా సరే అరెస్టు చేసి ఆ సామగ్రిని స్వాధీనం చేసుకోవచ్చు. ఈ కేసుకు మూడు నెలల జైలుశిక్ష లేదా జరిమానా ఉంటుంది. ఒక్కో సమయంలో రెండు కూడా విధించవచ్చు.
- **సెక్షన్ 132:** ఓటేసే సమయంలో నియమ నిబంధనలు పాటించని వారికి మూడు నెలల జైలు శిక్ష జరిమానా విధిస్తారు.
- **సెక్షన్ 134 :** అధికార దుర్వినియోగానికి పాల్పడితే జైలుశిక్ష లేదా జరిమానా ఉంటుంది.
- **సెక్షన్ 134(బీ):** పోలీస్‌స్టేషన్ పరిసర ప్రాంతాలకు మారణాయుధాలతో వెళ్లడం నిషిద్ధం. అలా వెళ్లిన వారికి రెండు నెలలు జైలుశిక్ష, జరిమానా విధిస్తారు.
- **సెక్షన్ 135 :** పోలింగ్ కేంద్రం నుంచి బ్యాలెట్ పత్రం, ఈవీఎం అపహరిస్తే శిక్షార్హులు. ఈ కేసుకు ఏడాది జైలు శిక్ష జరిమానా ఉంటుంది.
- **సెక్షన్ 135(బీ):** ప్రభుత్వ ఉద్యోగి ఎన్నికల ఏజెంటుగాగానీ, పోలింగ్ ఏజెంటుగా గానీ, ఓట్ల లెక్కింపు సమయంలో ఏజెంటుగానీ వ్యవహరిస్తే శిక్షార్హులు. ఇందుకు మూడు నెలల జైలు శిక్ష, జరిమానా ఉంటుంది.
- **సెక్షన్ 49(సీ):** ఒక వ్యక్తి ఓటు మరో వ్యక్తి వేస్తే పోలింగ్ ఆఫీసర్‌కు సదరు ఓటరు 49(సీ) సెక్షన్ ప్రకారం తన ఆధారాలు చూపించాలి. దీంతో ప్రిసైడింగ్ అధికారి సదరు ఓటర్‌కు ఓటు వేసే అవకాశం కల్పిస్తారు. చూపించలేకపోతే కేసు నమోదు చేసి జైలు శిక్ష విధిస్తారు.

తొలిసారి హోం ఓటింగ్



కర్నూలు(కలెక్టరేట్), మే 4: గతంలో జరిగిన ఏ ఎన్నికల్లో అయినా ఓటు హక్కు ఉన్న వృద్ధులు విధిగా పోలింగ్ కేంద్రాలకు వచ్చి ఓటు హక్కు వినియోగించుకునేవారు. అయితే వారు పోలింగ్ కేంద్రాలకు రావడం ఒక ఎత్తయితే.. పోలింగ్ బూత్‌లోకి వెళ్లి ఓటు వేయడం పెద్ద ప్రయాసగా మారడంతో పాటు వివిధ రకాల సమస్యలు తలెత్తేవి. ఈ క్రమంలో పోలింగ్ కేంద్రాల్లో గందరగోళం నెలకొనడం.. ఓటర్లు అభ్యంతరం తెలిపిన సందర్భాలూ ఉన్నాయి. ఎలాగోలా ఓటు హక్కును వినియోగించుకున్న వృద్ధులు తిరిగి ఇంటికి వెళ్లాలంటే నానా యాతన పడేవారు. ఇలాంటి ఇబ్బందులన్నీ గమనించిన కేంద్ర ఎన్నికల సంఘం ప్రస్తుతం జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో తొలిసారిగా పరిష్కారమార్గం చూపింది. 80ఏళ్లు దాటిన వృద్ధులు ఇంటి నుంచే ఓటు హక్కు వినియోగించుకునే వెసులుబాటు కల్పించింది. వృద్ధులు, దివ్యాంగులకు ఎన్నికల సంఘం కల్పించిన హోం ఓటింగ్ ప్రక్రియను జిల్లాలో ఈ నెల 6, 7, 8 తేదీల్లో నిర్వహించనున్నారు. కర్నూలు జిల్లాలో మొత్తం 997 మందికి హోం ఓటింగ్ ప్రక్రియ ద్వారా ఓటు హక్కు వినియోగించుకునే సౌకర్యాన్ని కల్పించారు. హోం ఓటింగ్ ప్రక్రియ నిర్వహణకు 60 మొబైల్ పోలింగ్ టీమ్‌లను ఏర్పాటు చేశారు. రహస్య ఓటింగ్ పద్ధతిలో హోం ఓటింగ్ ప్రక్రియ జరుగుతుంది. కర్నూలు అసెంబ్లీ నియోజకవర్గంలో 53 దరఖాస్తులు రాగా.. పాణ్యం అసెంబ్లీ నియోజకవర్గంలో 159, పత్తికొండ నియోజకవర్గంలో 118, కోడుమూరు నియోజకవర్గంలో 127, ఎమ్మిగనూరు నియోజకవర్గంలో 171, మంత్రాలయం నియోజకవర్గంలో 78, ఆదోని అసెంబ్లీ నియోజకవర్గంలో 63, ఆలూరు అసెంబ్లీ నియోజకవర్గంలో 228 దరఖాస్తులు వచ్చాయి.

రేపటి నుంచి పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్

- ఫెసిలిటేషన్ సెంటర్ల ఏర్పాటు
- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు



కర్నూలు(కలెక్టరేట్), మే 4: సార్వత్రిక సమరంలో మొదటి ప్రక్రియ పోస్టల్ 6వ తేదీ నుంచి ప్రారంభం కానుంది. ఇందుకోసం జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ జి. సృజన ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లను పూర్తి చేశారు. ఈ నెల 13వ తేదీ జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో ఎన్నికల విధులు నిర్వహించనున్న అధికారులు, సిబ్బందికి పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కును వినియోగించుకునేందుకు అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఫెసిలిటేషన్ సెంటర్లను ఏర్పాటు చేశారు. ఈ నెల 6వ తేదీ నుంచి 8వతేదీ వరకు అన్ని నియోజకవర్గాల్లో ఏర్పాటు చేస్తున్న ఫెసిలిటేషన్ సెంటర్లలో ఎన్నికల విధుల్లో ఉన్న అధికారులు, సిబ్బంది పోస్టల్ బ్యాలెట్‌ను వినియోగించుకోనున్నారు. అన్ని రకాల ఎన్నికల విధుల్లో ఉన్న పోలింగ్ సిబ్బంది పోస్టల్ బ్యాలెట్ కోసం ఇప్పటి వరకు 20,365 దరఖాస్తులు వచ్చాయి. ఫెసిలిటేషన్ కేంద్రాలు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు అందుబాటులో ఉంటాయి. జిల్లాలో ఓటు హక్కు ఉన్న ఉద్యోగులు ఏ నియోజకవర్గంలో ఓటు హక్కు ఉంటే ఆ నియోజకవర్గంలోని ఫెసిలిటేషన్ సెంటర్లలో పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కు వినియోగించుకోవాల్సి ఉంటుంది. అదేవిధంగా ఇతర జిల్లాలో ఓటు హక్కు ఉన్న ఉద్యోగులు వారు పని చేస్తున్న నియోజకవర్గ కేంద్రంలోని ఫెసిలిటేషన్ సెంటర్లలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కౌంటరులో పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కును వినియోగించుకుంటారు.

ఫెసిలిటేషన్ కేంద్రాలు ఇవే...

- **కర్నూలు అసెంబ్లీ(137):** ఇందిరా గాంధీ మెమోరియల్ మున్సిపల్ కార్పొరేషన్ హై స్కూల్, ఏ.క్యాంపు, కర్నూలు
- **పాణ్యం(138):** ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల, బీ. క్యాంపు, కర్నూలు
- **పత్తికొండ(142):** ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ఆర్‌అండ్‌బీ గెస్టు హౌస్ ఎదురుగా, ప్రభుత్వ జూనియర్ కళాశాల పక్కన, పత్తికొండ.
- **కోడుమూరు అసెంబ్లీ(143):** ప్రభుత్వ టౌన్ మోడల్ హై స్కూల్, కోట్ల సర్కిల్, పాత కంట్రోల్ రూమ్ దగ్గర, కర్నూలు.
- **ఎమ్మిగనూరు(144):** ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరం, ఎమ్మిగనూరు.
- **మంత్రాలయం(145):** జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, మంత్రాలయం
- **ఆదోని (146):** నెహ్రూ మెమోరియల్ మున్సిపల్ హైస్కూల్, మున్సిపల్ గ్రౌండ్, ఆదోని మున్సిపల్ కార్యాలయం వెనుక, ఆదోని.
- **ఆలూరు(147):** ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల-2 అంబేడ్కర్ సర్కిల్ దగ్గర, ఆలూరు.

'వైసీపీకి బుద్ధి చెప్పండి'

కోడుమూరు(రూరల్), మే 4: సార్వత్రిక ఎన్నికల్లో వైసీపీకి ఓటుతో బుద్ధి చెప్పాలని ఎమ్మార్పీఎస్ నాయకులు పిలుపునిచ్చారు. మండలంలోని ముడుమలగుర్తి ఎస్సీ కాలనీలో ఎమ్మార్పీఎస్, టీడీపీ నాయకులు సూపర్ సిక్స్ పథకాల గురించి ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా కట్టెల రాజు, నాగేష్ మాదిగ మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం ఎస్సీల పథకాలను నీరుగార్చిందని, ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులను దారిమళ్లించిందని అన్నారు. చంద్రబాబు సీఎం అయితేనే ఎస్సీ పథకాలు అమలవుతాయని అన్నారు. కార్యక్రమం టీడీపీ, జనసేన, ఎమా ర్పీఎస్ నాయకులు మధు, మల్లేష్, అయ్యస్వామి, గోకారి, గిరి, సిద్ధన్న పాల్గొన్నారు.

చంద్రబాబు సీఎం కావాలని పారాయణం

కోడుమూరు(రూరల్), మే 4: మండలంలోని అమడగుంట్లకు చెందిన పడిగె క్రిష్ణ చంద్రబాబు సీఎం కావాలని కోరుతూ సుందరకాండ పారాయణం చేశారు. గతంలో చంద్రబాబు అక్రమ కేసు నుంచి విడుదల కావాలని సుందర కాండ, భగవద్గీత పారాయణం చేశారు. ప్రస్తుతం సార్వత్రిక ఎన్నికలలో టీడీపీ కూటమి అత్యధిక సీట్లు సాధించి ప్రభుత్వం ఏర్పాటు చేయాలని, చంద్రబాబు ముఖ్యమంత్రి కావాలనే సంకల్పంతో స్థానిక లక్ష్మీచెన్నకేశవస్వామి ఆలయంలో పారాయణం చేశారు. ఆయన్ను టీడీపీ నాయకులు పూలమాల, దుశాలువా కప్పి సన్మానించారు.

జగన్‌ను ఇంటి పంపేందుకు సిద్ధం

సి.బెళగల్, మే 4: జగన్‌ను ఇంటికి పంపేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని టీడీపీ సీనియర్ నాయకుడు బురాన్‌దొడ్డి వెంకటప్ప అన్నారు. శనివారం మండలంలోని బ్యాలోలి గ్రామంలో బీసీ కాలనీలో సూపర్ సిక్స్ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ రామాంజనేయులు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

టీడీపీ ప్రచారంలో వైసీపీ జెండాలు

సి.బెళగల్, మే 4: మండలంలోని ఇనగండ్ల గ్రామంలో రాత్రి కోడుమూరు టీడీపీ అభ్యర్థి బొగ్గుల దస్తగిరి, టీడీపీ సీనియర్ నాయకుడు ఎదురూరు విష్ణువర్ధన్‌రెడ్డి ప్రచారంలోకి వైసీపీ కార్యకర్తలు రాజు, శోభన్‌లు జెండాలను పట్టుకుని జగన్ జై అని నినాదలు చేయడంతో ఇరువురి మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. దీంతో వైసీపీ కార్యకర్తలపై టీడీపీ కార్యకర్తలు దాడి చేశారని పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పది మంది టీడీపీ కార్యకర్తలపై కేసు నమోదు చేసి నట్లు ఎస్‌ఐ తిమ్మారెడ్డి తెలిపారు.

హజ్ యాత్రికులకు వ్యాక్సినేషన్



హజ్ యాత్రికురాలికి హెల్త్‌కార్డును అందజేస్తున్న డీఎంహెచ్‌వో

కర్నూలు(హాస్పిటల్), మే 4: జిల్లా నుంచి హజ్ యాత్రకు బయలుదేరుతున్న పది మందికి శనివారం నగరంలోని మేరిడియన్ ఫంక్షన్ హాలులో వ్యాక్సినేషన్ నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో వై.ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ హజ్ యాత్రికులు వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరా రు. హజ్ యాత్రికులకు మేనింగో కాకల్ వ్యాక్సిన్, ఇన్‌ఫ్లూయింజ వ్యాక్సిన్, ఓపీవీ ఓరల్ పోలియో వ్యాక్సిన్ వంటి మూడు రకాల వ్యాక్సిన్లు వేస్తారని, వీటిని ప్రభుత్వం అందరికీ ఉచితంగా అందిస్తుందని అన్నారు. అనంతరం వ్యాక్సినేషన్ వేసి యాత్రికులకు హెల్త్ కార్డులు డీఎంహెచ్‌వో అందజేశారు. కార్యక్రమంలో డీపీఎంవో డాక్టర్ ఉమ, నాగప్రసాద్, డీపీవో విజయరాజ్, ప్రాజెక్టనిస్టు ఖలీల్ పాల్గొన్నారు.

టీడీపీ ప్రభుత్వంలోనే పెన్షనర్ల సమస్యలు పరిష్కారం



సమావేశంలో మాట్లాడుతున్న టీజీ భరత్



మార్కెట్ యార్డులో మాట్లాడుతున్న టీజీ భరత్



టీజీ భరత్

పార్టీలో చేరిన వారితో టీజీ భరత్

కర్నూలు(అర్బన్), మే 4: విశ్రాంత ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలను తమ పార్టీ అధికారంలోకి వస్తే తప్పకుండా పరిష్కారిస్తామని కర్నూలు టీడీపీ అభ్యర్థి టీజీ భరత్ అన్నారు. శనివారం మౌర్యఇన్‌లోని పరిణయ హాలులో ఏపీ పెన్షనర్స్ అసోసియేషన్ అమరావతి ఆధ్వర్యంలో చంద్రబాబు గెలుపు..పెన్షనర్ల పిలుపు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంపీ సంజీవ్ కుమార్, ఎమ్మెల్సీ బీటీ నాయుడు, గౌరు వెంకటరెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా టీజీ భరత్ మాట్లాడుతూ రాష్ట్రాన్ని కాపాడుకోవాలంటే అందరూ తెలుగుదేశం పార్టీని గెలిపించుకోవాలన్నారు. అన్ని రంగాల ప్రజలు ఈ ఐదేళ్లలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారన్నారు. తమ ప్రభుత్వంలోనే అన్ని వర్గాలకు న్యాయం జరుగుతుందన్నారు. కర్నూల్లో తన పనితీరు ఇంత వరకు ప్రజలు చూడలేదన్నారు. ఎమ్మెల్యేగా ఒక్క అవకాశం ఇస్తే నగరాన్ని అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆల్ ఇండియా పెన్షనర్స్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ పూర్ణ చంద్ర రావు, ఏపీ సెక్రటేరియట్ ఎంప్లాయిస్ మాజీ అధ్యక్షుడు గురవయ్య, మెడికల్ ఎంప్లాయిస్ మాజీ అధ్యక్షుడు విస్డం చౌదరి, జిల్లా రిటైర్డ్ ఎంప్లాయిస్ అధ్యక్షుడు సుబ్రమణ్యం, జిల్లా మాజీ అధ్యక్షుడు క్రిష్టపర్, రిటైర్డ్ ఉద్యోగులు, తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలోకి చేరిక

కర్నూలు నగరంలోని బిర్లాగేటుకు చెందిన యువకులు తెలుగుదేశం పార్టీలో చేరారు. టీడీపీ నాయకులు రంగారెడ్డి, బాలు ఆధ్వర్యంలో కర్నూలు నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ అభ్యర్థి టీజీ భరత్ వీరికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

మార్కెట్ యార్డు సమస్యలు పరిష్కరిస్తా

వ్యవసాయ మార్కెట్ యార్డులో పేరకు పోయిన సమస్యలు తాను గెలిచాక పరిష్కరిస్తానని కర్నూలు టీడీపీ అభ్యర్థి టీజీ భరత్ అన్నారు. శనివారం నగరంలోని కొత్త బస్టాండ్ సమీపంలో ఉన్న వ్యవసాయ మార్కెట్ యార్డులో టీజీ భరత్ ప్రచారం నిర్వహించారు. హోల్ సెల్, రిటైల్ దుకాణాదారులు, కూరగాయల వ్యాపారులు, మార్కెట్‌కు వచ్చిన ప్రజలతో ఆయన మాట్లాడుతూ మార్కెట్ యార్డు సమస్యలు పరిష్కరిస్తానన్నారు. అనంతరం వెంకటరమణ కాలనీలోని పార్కులో టీజీ భరత్ వాకర్స్‌తో మాట్లాడారు. కర్నూలుకు పరిశ్రమలు తీసుకొచ్చి యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.

నగర సమస్యలన్నీ తీరుస్తా: టీజీ భరత్

కర్నూలు(అర్బన్): నగర సమస్యలన్నీ తీరుస్తానని కర్నూలు టీడీపీ అభ్యర్థి టీజీ భరత్ అన్నారు. శనివారం రాత్రి నగరంలోని ఆలిషరిబాగ్, బి.క్యాంపుల్లో ఆయన భరోసాయాత్ర కార్యక్రమం చేప ట్టారు. ఈసందర్భంగా ప్రజలు విద్యుత్ తీగలు, కాల్వలు, తాగునీరు, పింఛన్ తదితర సమస్యలను టీజీ భరత్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ కార్యక్రమంలో నగర అధ్యక్షుడు నాగరాజు యాదవ్, కార్పొరేటర్, జనసేన ఇన్‌చార్జి అర్షద్, కార్పొరేటర్ లతీఫ్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు శ్రీరాములు, రాష్ట్రప్రధాన కార్యదర్శి గీతా మాధురి, టీడీపీ నాయకులు ఆర్జా రామకృష్ణ, హమీద్, శ్రీదర్, మోయిన్‌బాషా, రాజశేఖర్ పాల్గొన్నారు.

పాణ్యం నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యం



నన్నూరు సభలో మాట్లాడుతున్న బైరెడ్డి శబరి, పక్కన గౌరు చరిత



గౌరు వెంకటరెడ్డి సమక్షంలో టీడీపీలో చేరిన తమ్మరాజుపల్లె వైసీపీ నాయకులు

ఓర్వకల్లు, మే 4: పాణ్యం నియోజకవర్గ అభివృద్ధే తమ లక్ష్యమని టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గౌరు చరిత అన్నారు. శనివారం మండలంలోని గుమితం తండా, తిప్పాయపల్లె, బ్రాహ్మణపల్లె, శకునాల, నన్నూరు గ్రామాల్లో గౌరు చరితతోపాటు నంద్యాల జిల్లా టీడీపీ అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. బ్రాహ్మణపల్లె గ్రామంలో వాణిజ్య విభాగం టీడీపీ పాణ్యం అధ్యక్షుడు నాగిరెడ్డి గౌరి చరితకు భారీ గజమాల వేసి సన్మానించారు. అలాగే బ్రాహ్మణపల్లెలో వైసీపీ 2, 7, వార్డు మెంబర్లు వరలక్ష్మీ, నాగరాజు, నాగేషులు, బోయ లక్ష్మీతోపాటు పది కుటుంబాలు, అలాగే తిప్పాయపల్లె గ్రా మానికి చెందిన వైసీపీ నాయకుడు వెంకట్రామిరెడ్డితో పాటు పది కుటుంబాలు టీడీపీలో చేరాయి. ఈసందర్భంగా గౌరు చరిత, మల్లెల రాజశేఖర్ మాట్లాడు తూ టీడీసీ ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ప్రతి పథకంలోనూ మహిళలకు పెద్దపీట వేశారన్నారు. సూపర్ సిక్స్ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ గోవిందరెడ్డి, విశ్వేశ్వరరెడ్డి, సుధాకర్ రెడ్డి, మురళీధర్ రెడ్డి, మోహన్ రెడ్డి, లక్ష్మీకాంతరెడ్డి, లక్ష్మణ్‌రావు, చంద్రపెద్ద స్వామి, లక్ష్మీనాయక్, రాము నాయక్, కృష్ణ నాయక్, ఏరాసు రాఘవరెడ్డి, ఏరాసు ప్రతాప్ రెడ్డి పాల్గొన్నారు.

మీ ఇంటి ఆడపడుచులుగా ఆదరించండి

మీ ఇంటి ఆడపడుచులుగా ఆదరించి తమను గెలిపించాలని పాణ్యం టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గౌరు చరిత, నంద్యాల పార్లమెంటు టీడీపీ అభ్యర్థి బైరెడ్డి శబరి కోరారు. శనివారం రాత్రి మండలంలోని నన్నూరు గ్రామంలో ఎన్నికల ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. చంద్రబాబు మేనిఫెస్టోలో అమలు చేసిన పథకాలపై ఓటర్లకు వివరించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రం ఇప్పటికే జగన్ పాలనలో 30 సంవత్సరాలు అభివృద్ధిలో వెనక్కి వెళ్లిందన్నారు. మళ్లీ చంద్రబాబు అధికారంలోకి వస్తే మరెన్నో పరిశ్రమలు వస్తా యన్నారు. కార్యక్రమంలో నాయకులు గోవిందరెడ్డి, విశ్వేశ్వరరెడ్డి, మోహన్ రెడ్డి, షేర్‌ఖాన్, సర్దార్ భేగ్, ఆలిబేగ్, సర్దార్ ఖాన్, సర్కార్, ఖాజా మియా, శివరాముడు, గణేష్, విజయుడు, ఖాజామియా, సుబ్బారెడ్డి, శేఖర్ రెడ్డి పాల్గొన్నారు.

టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గౌరు చరిత

గౌరు సమక్షంలో టీడీపీలో చేరిక

కల్లూరు: పాణ్యం మండలం తమ్మరాజుపల్లె గ్రామానికి చెందిన వైసీపీ నాయకులు టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. శనివారం మాధవీ నగర్‌లోని తన స్వగృహంలో గౌరు వెంకటరెడ్డి టీడీపీ కండువాలు కప్పి వారిని పార్టీలోకి ఆహ్వానిం చారు. పార్టీలో చేరిన వారిలో కట్టుబడి బాలమద్ది, తలారి బాలస్వామి, మద్దయ్య, అచ్చెన్న, పాపారాయుడు, మద్దిలేటి, రాముడు, షేక్షావలి, టేకూరు మద్దయ్య, మధుసూదన్‌నాయుడు ఉన్నారు. కార్యక్రమంలో కాకర్ల మధు, సాకే.రాజేంద్రగౌడ్, ఎల్ల వెంకటసుబ్బయ్య, సురేష్ పాల్గొన్నారు.

సూపర్‌సిక్స్ పథకాలతో ప్రజలకు మేలు: గౌరు జనార్దన్‌రెడ్డి

చంద్రబాబు ప్రవేశపెట్టిన మేనిఫేస్టోలోని సూపర్‌సిక్స్ పథకాలు ప్రజలకు మేలు చే స్తాయని గౌరు జనార్దన్‌రెడ్డి అన్నారు. శనివారం కల్లూరు అర్బన్ 34, 36వ వార్డు రాగమయూరి, తిరుమలగిరి ఏస్టేట్‌లో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించి టీడీపీ సూపర్‌సిక్స్ పథకాలను వివరించారు. ఈసందర్భంగా గౌరు జనార్దన్‌రెడ్డి మాట్లాడుతూ ఈ పది రోజులు కార్యకర్తలు కష్టపడి పని చేసి, పాణ్యం టీడీపీ అభ్యర్థి గౌరు చరితను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో కల్లూరు క్లస్టర్ ఇన్‌చార్జి పీయూ.మాదన్న, 36వ వార్డు టీడీపీ ఇన్‌చార్జి ఆర్. తిరుమలేశ్వరరెడ్డి, కాసాని మహేష్‌గౌడ్, లోకేశ్వరరెడ్డి, డీవీ.చంద్ర, నారాయణగౌడ్, రంగప్ప, తులసీ, శేఖర్‌గౌడ్ జనసేన, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

ప్రజల ఆస్తులు దోచుకునేందుకు జగన్ సిద్ధం : విష్ణు

మన ఆత్మగౌరవాన్ని నాన్ లోకల్ అభ్యర్థికి కట్టబెట్టొద్దు: బొగ్గుల దస్తగిరి

కర్నూలు(రూరల్), మే4: రాష్ట్రంలో మరోసారి వైసీపీ అధికారంలోకి వస్తే ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ ముసుగులో ప్రజల ఆస్తులను దోచుకునేందుకు జగన్‌రెడ్డి సిద్ధంగా ఉన్నారని టీడీపీ సీనియర్ నాయకుడు విష్ణువర్ధన్‌రెడ్డి విమర్శించారు. బెదిరించే ప్రభుత్వాన్ని ఎదురించాల్సిన సమయం వచ్చిందని అన్నారు. కర్నూలు రూరల్ మండలం నందనపల్లె గ్రామంలో శనివారం స్థానిక టీడీపీ నాయకులు కెయి. వేమన్నగౌడ్, కెయి. ఈశ్వరయ్యగౌడ్ ఆధ్వర్యంలో టీడీపీ అభ్యర్థి బొగ్గుల దస్తగిరి, విష్ణువర్ధన్‌రెడ్డి కలిసి ఇంటింటా ప్రచారం చేశారు. గ్రామస్థులు వారికి క్రేన్ ద్వారా భారీ గజమాలతో సత్కరించారు. ఈ సందర్భంగా విష్ణు మాట్లాడుతూ టీడీపీ అధికారంలోకి వస్తే ఈ ప్రాంతవాసులకు పరిశ్రమలు ఏర్పాటు చేయించి ఉపాధి అవకాశాలు కల్పిస్తామని హామినిచ్చారు. బొగ్గుల దస్తగిరి మాట్లాడుతూ ఈ ఎన్నికల్లో కోడు మూరు నియోజకవర్గ ఆత్మగౌరవాన్ని ప్రకాశం జిల్లా వాసి అయిన నాన్‌లోకల్ అభ్యర్థి సతీష్‌కు తాకట్టు పెట్టవద్దని ప్రజలను కోరారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు కేయి. వేణు, జగదీష్, అనిల్, యాగంటీశ్వరరెడ్డి, కురువ వెంకటేశ్వర్లు, యోగీనాయక్, యోగీశ్వరగౌడ్ పాల్గొన్నారు.



ఎన్నికల ప్రచారంలో విష్ణువర్ధన్‌రెడ్డి, బొగ్గుల దస్తగిరి



నందనపల్లెలో విష్ణు, దస్తగిరిని గజమాలతో సత్కరిస్తున్న టీడీపీ నాయకులు

● వెంకయపల్లె గ్రామంలో టీడీపీ అభ్యర్థి బొగ్గుల దస్తగిరి, విష్ణువర్ధ న్‌రెడ్డి, కేఈ వేమన్నగౌడ్ టీడీపీ ప్రచారం నిర్వహించారు. నాయకులు నజీర్, నాగేంద్ర, చిన్నయ్య, జాన్ పాల్గొన్నారు.

●మిలటరీ కాలనీ, భూపాల్ నగర్‌లో టీడీపీ అభ్యర్థి బొగ్గుల దస్తగిరి, విష్ణువర్ధన్‌రెడ్డి ఇంటింటా ప్రచారం చేశారు. అనంతరం వారు సూపర్‌సిక్స్ పథకాలను ప్రజలకు వివరించారు.కార్యక్రమంలో శరత్, శేషయ్య, శివుడు, మల్లి, అభిలాష్, రమేష్, అభిమన్యుసింగ్ పాల్గొన్నారు.

● సూదిరెడ్డిపల్లె, నూతనపల్లె గ్రామాల్లో స్థానిక నాయకులు బి.శ్రీని వాసులు, బి.వెంకట్రాముడు ఆధ్వర్యంలో టీడీపీ అభ్యర్థి బొగ్గుల దస్తగిరి, విష్ణువర్ధన్‌రెడ్డి కలిసి ప్రచారం చేశారు.

పోటీపడి దోచుకున్నారు: విష్ణు

కోడుమూరు/ కోడుమూరు(రూరల్): కోడుమూరు నియోజకవర్గ ఎమ్మెల్యే, పార్టీ ఇన్‌చార్జి పోటీ పడి సంపాదించి అక్రమ సొమ్ము కూడబెట్టారని టీడీపీ సీనియర్ నేత విష్ణువర్ధన్‌రెడ్డి ఆరోపించారు. శనివారం సాయంత్రం ప్యాలకుర్తి గ్రామంలో ఎమ్మెల్యే అభ్యర్థి బొగ్గుల దస్తగిరితో కలిసి ప్రచారం నిర్వహించారు. అనంతరం ఎస్సీ కాలనీ మీదుగా కెనరాబ్యాంకు, ముస్లిం కాలనీ, మెయిన్ బజార్ చేరుకుని పార్టీ కార్యాలయం ప్రారంభించారు. ఈసందర్భంగా విష్ణువర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ కోడుమూరు నియోజకవర్గ అభివృద్ధిని మరిచిన ఎమ్మెల్యే, ఇన్‌చార్జిలు భూదందాలు, ఇసుక, ఎర్రమట్టి దోపిడీకి పాల్పడి కోట్లు వెనుకేసుకున్నారని అన్నారు.

రైతులను ఆదుకుంటా: బొగ్గుల దస్తగిరి

ఒక్క అవకాశం ఇవ్వండి రైతులను ఆదుకుంటానని టీడీపీ అభ్యర్థి బొగ్గుల దస్తగిరి తెలిపారు. ప్యాలకుర్తిలో బొగ్గుల దస్తగిరి మాట్లాడుతూ తాను సామాన్య రైతు బిడ్డనని, వారి కష్టాలు తెలిసినవాడినని అన్నారు. రైతులకు సాగునీరు అందించి వలసలు లేకుండా కృషి చేస్తానని అన్నారు. వైసీపీ అభ్యర్థి వక్ఫ్ భూములు కబ్జా చేశాడని ఆరోపించారు. ప్రకాశం జిల్లా వ్యక్తి దోచుకోవడానికి వచ్చాడు తప్ప సేవ చేయడానికి కాదని గుర్తించుకోవాలన్నారు. ల్యాండ్ టైటిలింగ్ చట్టంతో రైతుల పొలాలు కూడా వైసీపీ నేతల చేతిలోకి వెళ్లిపోతాయని హెచ్చరించారు. అంతకు ముందు టీడీపీ నేతలకు కొత్తూరు, ప్యాలకుర్తి నాయకులు ఘనస్వాగతం పలికారు. కార్యక్రమంలో చంద్రమౌళి, సునీల్, మిన్నల్ల, ఉగాది వెంకటేశ్వర్లు, రాఘవేంద్ర, చిన్నవీరన్న, దోని క్రిష్ణ, జగ్గు వెంకటేశ్వర్లు, లారీ విజయ్, షేక్షావలి, యాసుఫ్, ఆరీఫ్, ఎం మన్సూర్, ఎస్ అలీంబాషా, మౌలిసాహెబ్ పాల్గొన్నారు.

పది గంటల్లోపు పనులు ముగించుకోవాలి



వడదెబ్బపై మాట్లాడుతున్న డెమో ప్రమీలాదేవి

కర్నూలు(హాస్పిటల్), మే 4: ఎండల తీవ్రత అధికంగా ఉందని, ప్రజలు ఉదయం 10 గంటలలోపు తమ పనులు ముగించుకోవాలని మాస్ మీడియా అధికారి ప్రమీలాదేవి అన్నారు. శనివారం ఓర్వకల్లు మండల పరిధిలోని నన్నూరు గ్రామంలో వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో వడదెబ్బ నివారణపై ప్రజలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డెమో మాట్లాడుతూ వడదెబ్బకు గురైన వ్యక్తిని త్వరగా నీడకు తరలించాలని, గాలి తగిలేటట్లు చూడాలని, దుస్తులు వదులు చేయాలని సూచించారు. బయట ఎండలో వెళ్లేటప్పుడు గొడుగు, టోపి, తలపై టవల్ పెట్టుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఈఈవో శ్రీనివాసులు, డిప్యూటీ డెమో చంద్రశేఖర్ రెడ్డి, పీహెచ్ఎన్ విజయలక్ష్మి, సీహెచ్‌వో సుమధుర, హెల్త్ సూపర్‌వైజర్ ప్రభాకర్ రెడ్డి, ఆరోగ్య కార్యకర్త భీమేశ్వరి, అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

మెటల్ తవ్వకాలపై జరిమానా

ఉపగ్రహ ఛాయా చిత్రం ద్వారా గుర్తింపు

కర్నూలు(అర్బన్), మే 4: మొదటిసారిగా జిల్లాలో ఉపగ్రహ ఛాయ చిత్రం ద్వారా రోడ్డు మెటల్ అక్రమ తవ్వకాలను గుర్తించి జరిమానా కింద రూ. 3 లక్షలు వసూలు చేసిన ట్లు గనుల శాఖ డిప్యూటీ డైరెక్టర్ రాజశేఖర్ తెలిపారు. శనివారం కల్లూరు మండలంలో తడకనపల్లెలోని సర్వే నెంబర్ 413/ఏ రోడ్డు మెటల్ అక్ర మంగా తరలిస్తున్న లక్ష్మి సాయినాథ్ స్టోన్ క్రస్సింగ్ యజమాని కే. వరలక్ష్మికి నోటీసుల జారీ చేశారు. వారు తప్పు అంగీకరించి జరిమానా చెల్లించారని పేర్కొన్నారు.

తెలుగువారి సంస్కృతికి కూచిపూడి ప్రతిరూపం

కర్నూలు(కల్చరల్), మే 4: కూచిపూడి నృత్యం తెలుగువారి సంస్కృతికి ప్రతిరూపమని కేంద్ర సంగీత నాటక అకాడమి సభ్యుడు డాక్టర్ వేదాంతం రామలింగ శాస్త్రి అన్నారు. గత నెల 30న టీజీవీ కళాక్షేత్రంలో 'కూచిపూడి నవ వసంతం' పేరుతో ప్రారంభమైన కూచిపూడి అభ్యాసకుల శిక్షణ కార్యక్రమాలు శనివారం రాత్రి ఘనంగా ముగిశాయి. ముఖ్య అతిథిగా వచ్చేసిన రామలింగ శాస్త్రి తొలుత నటరాజ స్వామి విగ్రహానికి పూజలు చేసి, జ్యోతిప్రజ్వలనతో కార్యక్రమాలను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ సంప్రదాయ కూచిపూడి నృత్యం నేడు ప్రపంచ దేశాల్లో ఆదరణ పొందుతోందని చెప్పారు. ఈ సమావేశానికి అధ్యక్షత వహించిన టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య మాట్లాడారు. నృత్య గురువులు భవానీ దుర్గ, డాక్టర్ వసంత్‌కుమార్, నిర్వాహకులు తేజేశ్వరి, రోహిత్ శిక్షణలకు సంబంధించిన విషయాలు తెలియజేశారు. కేరళకు చెందిన కళాకారుల ప్రదర్శించిన మలయాళీ నృత్యం ఆకర్షణగా నిలిచింది. టీజీవీ కళాక్షేత్రం తరఫున పత్తి ఓబులయ్య నగదు బహుమతిని అందజేశారు. డాక్టర్ రామలింగశాస్త్రి, వసంత్ కిరణ్‌లను ఘనంగా సత్కరించి జ్ఞాపికలు ప్రదానం చేశారు.

పోస్టల్ బ్యాలెట్ కేంద్రం పరిశీలన

కర్నూలు(న్యూసిటీ), మే 4: స్థానిక ఏ.క్యాంపులో ఇందిరాగాంధీ మెమోరియల్ పాఠశాలలో ఏర్పాటు చేసిన పోస్టల్ బ్యాలెట్ ఫెసిలిటేషన్ కేంద్రాన్ని శనివారం కర్నూలు అసెంబ్లీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి ఎ.భార్గవ్‌తేజ తనిఖీ చేశారు. ఆయన వెంట ట్రైనీ కలెక్టర్ చల్లా కళ్యాణి, మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ కే.విశ్వేశ్వరరెడ్డి ఉన్నారు.

ముగిసిన ఈవీఎం కమిషనింగ్ ప్రక్రియ

కర్నూలు(న్యూసిటీ), మే 4: 2024 సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా కర్నూలు పార్లమెంటు నియోజకవర్గ ఈవీఎంల కమిషనింగ్ ప్రక్రియ పూర్తయిందని ఎన్నికల అధికారి ఏ. భార్గవతేజ తెలిపారు. శనివారం ఔట్‌డోర్ స్టేడియంలో నిర్వహించిన ప్రక్రియలో కమిషనింగ్ కోసం నియమితులై శిక్షణ పొందిన 50 మంది అధికారులు వారి బృందాలు ప్రక్రియ నిర్వహించారు. బెల్(భారత్ ఎలక్ట్రానిక్ లిమిటెడ్) ఇంజనీర్లు కంట్రోల్ యూనిట్లలో అభ్యర్థుల వివరాలు లోడ్ చేయడం, వీవీ ప్యాట్లలో అభ్యర్థుల పేర్లతో పాటు వారి చిహ్నాలను లోడ్ చేసినట్లు తెలిపారు. 5 శాతం ఈవీఎంలలో మాక్ పోలింగ్ నిర్వహించి 1000 ఓట్లు వేసి ఈవీఎంల పారదర్శకతను నిర్ధారించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ట్రైనీ కలెక్టర్ చల్లా కల్యాణి, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి మోహన్‌కుమార్, అడిషనల్ కమిషనర్ పీవీ.రామలింగేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

అరసం నగర గౌరవాధ్యక్షుడిగా డాక్టర్ హరికిషన్

కర్నూలు(కల్చరల్), మే 4: అభ్యుదయ రచయితల సంఘం (అరసం) నూతన నగర శాఖకు గౌరవాధ్యక్షుడిగా ప్రముఖ బాలల కథా రచయిత డాక్టర్ ఎం. హరికిషన్ నియమితులయ్యారు. అరసం నగర అధ్యక్షురాలిగా కవయిత్రి రాణి లీలావతి, ప్రధాన కార్యదర్శిగా యువ రచయిత జీవీ ప్రమోద్ చక్రవర్తి నియ మితులయ్యారు. శనివారం వీరి నియామకాన్ని ఆమోదిస్తూ విరసం రాష్ట్ర అధ్యక్షుడు, ఎస్కేయూ విశ్రాంత ఆచార్యులు రాచపాళెం చంద్రశేఖర్‌రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ ఎం. హరికిషన్ మాట్లాడుతూ అరసం అభ్యుదయ, ప్రగతిశీల సాహిత్యాన్ని విస్తృత పరిచేందుకు కృషి చేస్తున్నదని చెప్పారు. కొత్తతరం రచయితలు, కవులను ప్రోత్సాహిస్తూ సామాజిక చైతన్య దిశగా కార్యక్రమాలతో ముందుకు పోతున్నదని చెప్పారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం

కర్నూలు(రూరల్), మే 4: కర్నూలు రూరల్ మండలం ఎదురూరు వద్ద శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన సంజిపోగు రవీంద్ర కుటుంబానికి కర్నూలు పార్లమెంటు టీడీపీ ఎంపీ అభ్యర్థి బస్తిపాటి నాగరాజు, కోడుమూరు టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బొగ్గుల దస్తగిరిలు శనివారం ఆర్థిక సాయం అందజేశారు. సి.బెళగల్ మండలం కొత్తకోట గ్రామానికి చెందిన సంజిపోగు రవీంద్ర (33)తో పాటు మరికొంత మంది సెంట్రింగ్ పనులు చేసేందుకు కొత్తకోట నుంచి కర్నూలుకు బొలేరో వాహనంలో బయలు దేరారు. మార్గమధ్యలో ఎదురూరు సమీపాన అదుపు తప్పి వాహనం బోల్తా పడింది. ఈ ప్రమాదంలో సంజి పోగు రవీంద్ర అక్కడికక్కడే మృతి చెందగా, ఆరుగురికి గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న టీడీపీ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు నాగరాజు, దస్తగిరిలు మృ తుడి కుటుంబానికి రూ.50వేలు ఆర్థిక సాయం అంద జేశారు. అలాగే ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందు తున్న క్షతగాత్రులను పరామర్శించి వారందరికీ కలిపి రూ.50వేలును వారి వైద్య ఖర్చులకు అందజేశారు.

శభాష్‌పురంలో వైసీపీ నాయకుడి అరెస్టు

పత్తికొండ, మే 4 : తుగ్గలిమండలపరిధిలోని శభాష్‌పురంలో శనివారం పోలీస్, సెబ్ సిబ్బంది వేరువేరు దాడులలో సుమారు 57 కర్నాటకమద్యం బాక్సలు, 55 బీర్‌బాటిల్స్, 20 క్వార్టర్ బాటిల్స్ సీజ్‌చేశారు. గ్రామానికి చెందిన వైసీపీ నాయకుడు బండి శ్రీనివాసులును అరెస్ట్‌చేసి స్టేషన్‌కు తరలించారు. గ్రామంలో నిల్వఉంచిన 23 బాక్సలు కర్నాటక మద్యం (టెట్రాప్యాకెట్స్), 55 బీర్లు, 20 మాన్షన్‌హౌస్ కార్టర్‌బాటిల్స్‌ను సీజ్‌చేశారు.

పోస్టల్‌బ్యాలెట్‌ను సద్వినియోగం చేసుకోండి : ఆర్‌వో

పత్తికొండ, మే 4 : ఎన్నికల నిర్వహణలో విధులు నిర్వహించే ఉద్యోగులు తమకు కేటాయించిన పోస్టల్‌బ్యాలెట్‌ను సద్వినియోగం చేసుకోవాలని పత్తికొండ ఆర్‌వో రామలక్ష్మి కోరారు. శనివారం స్థానిక కార్యాలయంలో ఆమె విలేకర్లతో మాట్లాడారు. 6,7,8వ తేదీలలో పోస్టల్‌బ్యాలెట్ పోలింగ్ కేంద్రం అందుబాటులో ఉంటుందని, ఉదయం 9నుంచి సాయంత్రం 5వరకు కౌంటర్‌లు పనిచేస్తాయని అన్నారు. పత్తికొండ బాలుర హైస్కూల్‌లో పోలింగ్‌కేంద్రాలను ఏర్పాటు చేశామని పేర్కొన్నారు.

ఆర్డీటీ ఉచిత విద్యకు దరఖాస్తు చేసుకోండి

పత్తికొండ టౌన్, మే 4: ప్రభుత్వ పాఠశాలలో చదివి, పదవ తరగతిలో 500 మార్కులు పైబడి సాధించిన పేద విద్యార్థులకు ఆర్డీటీ అందిస్తున్న ఇంటర్ ఉచిత విద్యకు ఈ నెల 10వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని ఆర్డీటీ ఏరియా టీమ్ లీడర్ రెహానాబీ తెలిపారు. శనివారం స్థానిక ఆర్డీటీ కార్యాలయంలో విద్యార్థులు, తల్లిదండ్రులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ప్రతి ఏటా పేద విద్యార్థుల చదువు కోసం రూ.10 కోట్లకు పైగా ఆర్డీటీ సంస్థ ఖర్చు పెడుతుందని గుర్తు చేశారు. ఈ ఏడాది కూడా ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులకు సెంట్రల్ సిలబస్‌లో 420 మార్కులు సాధించిన విద్యార్థులకు కార్పొరేట్ కళాశాలలో ఇంటర్ విద్య అభ్యసించేందుకు ఆర్డీటీ సంస్థ పూర్తి స్థాయిలో ఖర్చు బరిస్తుందన్నారు. ఈ నెల 10వ తేదీలోగా ఆర్డీటీ సంస్థకు దరఖాస్తు చేసుకోవాలని, 19న ఆదోనిలో ఎంట్రెన్స్ పరీక్షలు ఉంటాయని పేర్కొన్నారు. వివరాల కోసం 9652124627ను సంప్రదించాలని సూచించారు.

పెద్దతుంబళంకు జూనియర్ కాలేజి మంజూరు

ఆదోని (అగ్రికల్చర్), మే 4: మండలంలోని పెద్దతుంబళం గ్రామానికి ప్రభుత్వం జూనియరు కాలేజి మంజూరు చేసిందని ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకటేశులు తెలిపారు. ఈ విద్యా సంవత్సరం (2024-25) నుండి ఇంటర్ మొదటి సంవత్సరానికి ప్రవేశాలు ప్రారంభమయ్యాయన్నారు. ఎంపీసీ, బైపీసీ, సీఇసీ, విభాగాల్లో ఏవైనా రెండింటికి విద్యార్థుల ఆసక్తిని బట్టి ప్రారంభిస్తామన్నారు. సీబీఎస్సీ ఆంగ్ల మాధ్యమంలో బోధన ఉంటుందన్నారు. బాలురు, బాలికలకు కో-ఎడ్యుకేషన్ ఉంటుందన్నారు. గ్రామీణ విద్యార్థులకు మంచి అవకాశమని, విద్యార్థులందరు త్వరపడి తమ పేర్లను నమోదు చేసుకోవాలని, తరగతులు జూన్ ఒకటో తేది నుండి ప్రారంభమవుతాయని తెలిపారు.

వివాహిత ఆత్మహత్య

గోనెగండ్ల, మే 4: చిన్నమరివీడు గ్రామానికి చెందిన బోయ లక్ష్మి(34)అనే వివాహిత కడుపు నొప్పి తాళలేక శనివారం తెల్లవారుజామున ఇంట్లోని ఫ్యాన్ ఇనుప కొండికి ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు సీఐ రామకృష్ణయ్య తెలిపారు. పోలీసుల సమాచారం మేరకు బోయ లక్ష్మి తీవ్రమైన కడుపునొప్పి తాళలేక జీవితం పై విరక్తి చెంది ఇంట్లో అందరు నిద్రిస్తున్న సమయంలో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంది. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించేలోపే మృతి చెందింది. మృతురాలికి భర్త వెంకటేశ్వర్లు, ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. మృతురాలి తల్లి సుంకులమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

టీడీపీలోకి 1500 మంది చేరిక






బీవీ సమక్షంలో టీడీపీలో చేరుతున్న ఉప్పర సామాజిక వర్గీయులు, మాజీ జడ్పీచైర్మన్ బుట్టారంగయ్యతో బీవీ ఇష్టాగోష్టి, చేనేతల ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న బీవీ, హాజరైన చేనేత మహిళలు

- పట్టణంలో ముమ్మరంగా బీవీ ఇంటింటి ప్రచారం
- మాజీ మున్సిపల్ చైర్మన్ బుట్టా రంగయ్యను కలిసిన బీవీ
- చేనేతలు, తెలుగు యువతతో ఆత్మీయ సమావేశం

ఎమ్మిగనూరు , మే 4: ఎమ్మిగనూరు నియోజకవర్గంలో తెలుగుదేశం గాలివీస్తోంది. వివిధ సామాజిక వర్గాలకు చెందిన యువత పెద్ద సంఖ్యలో టీడీపీ అభ్యర్థి జయనాగేశ్వరరెడ్డిని కలిసి తమ మద్దతు ప్రకటించి టీడీపీ కండువాలు కప్పుకున్నారు. శనివారం పట్టణంలోని 29వ వార్డు మిలటరీ కాలనికి చెందిన ప్రసాద్ ఆధ్వర్యంలో 200మంది, ఉప్పర కుల సంఘం నాయకులు యు.జి ప్రకాష్ ఆధ్వర్యంలో యూత్ సభ్యులు 200 మంది , ఎస్ఎంటీ కాలనీ 25వ వార్డుకు చెందిన 100 మంది ఉప్పర రవికుమార్ ఆధ్వర్యంలోను, 14వ వార్డు ఇన్‌చార్జి బందెనవాజ్ ఆధ్వర్యంలో 500 మంది, ఎంఎస్ నగర్‌కు చెందిన గౌడ సంఘం సభ్యులు 300 మంది, సోములగూడూరుకు చెందిన 50 కుటుంబాలు, పరమాన్‌దొడ్డికి చెందిన 100 కుటుంబాలతో పాటు దైవందిన్నె, ఐరన్‌బండ, పుట్టపాశం గ్రామాలకు చెందిన వైసీపీ నాయకులు బీవీకి మద్దతు ప్రకటించి టీడీపీలో చేరారు. వీరికి టీడీపీ అభ్యర్థి బీవీ జయనాగేశ్వరరెడ్డి పార్టీ కండువాకప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి, కృష్ణారెడ్డి, పాండురంగారెడ్డి, మారెప్ప, సూరిబాబు, పట్టణ నాయకులు సోడాల శీను, అజాం, శేఖర్, గిడ్డయ్య, యు.జి చిన్న పాల్గొన్నారు.

పట్టణంలో ఇంటింటి ప్రచారం

ఎన్నికల ప్రచారంలో భాగంగా లక్ష్మీపేట, సంజీవయ్యనగర్ తదితర ప్రాంతాల్లో బీవీ జయనాగేశ్వరరెడ్డి పార్టీ శ్రేణులతో కలిసి విస్తృతంగా ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం పట్టణాభివృద్ధిని విస్మరించిందని, రహదారులు, మురుగు కాలువలు పాడైపోయి ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. టీడీపీ వచ్చిన వెంటనే పట్టణాభివృద్ధికి పూర్వవైభవం తీసుకువస్తానని హామీ ఇచ్చారు.

చేనేతలతో ఆత్మీయ సమావేశం

స్థానిక సంజీవయ్యనగర్‌లో చేనేతల ఆత్మీయ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సమావేశానికి హాజరైన ఎంపీ సంజీవకుమార్, టీడీపీ అభ్యర్థి జయనాగేశ్వరరెడ్డి మాట్లాడుతూ ఈ ఐదేళ్లకాలంలో వైసీపీ ప్రభుత్వం చేనేతలకు చేసిందేమిలేదన్నారు. చేనేతల ఉపాధి కోసం బనవాసి దగ్గర కేటాయించిన టెక్స్‌టైల్ పార్కు స్థలాన్ని జగనన్న పాట్లకు కేటాయించి చేనేతల ఉపాధిపై మట్టికొట్టారన్నారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే టెక్స్‌టైల్ పార్కు ఏర్పాటు చేస్తామని, 50ఏళ్లకే పింఛన్‌తో పాటు, మరమగ్గాలకు 500యూనిట్లు, గుంత మగ్గాలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్, చేనేతలు కొనుగోలు చేసే ముడిసరుకుపై జీఎస్టీ రీయంబర్స్‌మెంట్ ఇస్తామని హామీ ఇచ్చారు. అనంతరం తెలుగు యువతతో ఆత్మీయ సమావేశాన్ని నిర్వహించారు. అందరు కలిసి ఐక్యంగా టీడీపీని గెలిపించుకోవాలన్నారు. ఎన్నికల్లో తనను భారీ మెజార్టీతో ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరారు. సమావేశంలో 33వ వార్డు మాజీ కౌన్సిలర్ రామకృష్ణనాయుడు, కామార్తి మహేష్ పాల్గొన్నారు.

పేట, కనకవీడులో బీవీ ప్రచారం

నందవరం: మండలంలోని పేట, కనకవీడు గ్రామ పంచాయతీలలో బీవీ ప్రచారం చేశారు. ఇంటింటికీ వెళ్లి ప్రజలతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు దేశాయి మాధవరావు, వైస్ ఎంపీపీ రఘుమూర్తిస్వామి ముగతి ఈరన్నగౌడు, బండెగురుస్వామి, కాశీంవలీ,మండల పార్టీ కన్వీనర్ డివి రాముడు, రైస్‌మిల్ నారాయణరెడ్డి,గురురాజారావు తదితరులు ఆయన వెంట ఉన్నారు.

మాకు శత్రువులు ఎవరూలేరు.. అందరు మిత్రులే : బీవీ

ఎన్నికల ప్రచారంలో భాగంగా లక్ష్మీపేటలో ప్రచారం నిర్వహిస్తూ మాజీ మున్సిపల్ చైర్మన్, వైసీపీ సీనియర్ నాయకులు బుట్టారంగయ్య ఇంటి దగ్గరకు వెళ్లారు. ఈ సందర్భంగా ఆయన ఇంట్లోకి వెళ్లి బుట్టా రంగయ్యతో కొద్దిసేపు ఇష్టాగోష్టిగా మాట్లాడారు. బీవీ మాట్లాడుతూ మాకు శత్రువులు ఎవరూ లేరని, అందరూ మిత్రువులేనని..ప్రత్యర్థి పార్టీ వారిని కూడా ఓటు అడుగుతానని బుట్టారంగయ్యను ఓటువేయాలని కోరారు. కొద్దిరోజులుగా వైసీపీ నేత బుట్టారంగయ్య ఎన్నికల ప్రచారానికి దూరంగా ఉంటూ వస్తున్నారు. దీంతో వైసీపీని వీడి టీడీపీలో చేరుతారనే ప్రచారం సైతం పట్టణంలో ఉంది. ఇలాంటి తరుణంలో బీవీ, బుట్టా కలవడం సర్వత్రా చర్చనీయాంశంగా మారింది.

గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తా




బెల్డోణలో వైసీపీ నుంచి టీడీపీలో చేరుతున్న యాదవ కుటుంబాలు, బిణిగేరిలో ప్రచారం నిర్వహిస్తున్న వీరభద్రగౌడ్

- టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వీరభద్రగౌడ్
- ఆస్పరి మండలంలో విస్తృత ప్రచారం

ఆస్పరి, మే 4: ఆలూరు నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో తిష్ట వేసిన సమస్యలను పరిష్కరించి గ్రామీణాభివృద్ధికి కృషి చేస్తానని టీడీపీ ఆలూరు ఎమ్మెల్యే అభ్యర్థి వీరభద్రగౌడ్ అన్నారు. శనివారం మండలంలోని బిణిగేరి, నగరూరు, కారుమంచి, కోటకొండ, జొహరాపురం, చిన్నహోతూరు, గ్రామాల్లో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు మేనిఫెస్టోలో పేర్కొన్న హామీలన్ని తూచా తప్పకుండా అమలు చేసి తీరతామన్నారు. ప్రధానంగా నియోజకవర్గ ప్రజలు ఎదుర్కొంటున్న తాగునీటి సమస్య, డ్రైనేజీ, రోడ్లు సమస్యలతో పాటు మేనిఫెస్టోలోని ప్రతి అంశాన్ని నియోజకవర్గ ప్రజలు దరిచేరుస్తానన్నారు. రాష్ట్ర అభివృద్ధి చంద్రబాబుతోనే సాధ్యమని, అరాచక పాలన సాగిస్తున్న వైయస్ జగన్మోహన్ రెడ్డిని ఇంటికి సాగనంపాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో ఏమాత్రం అభివృద్ధి సంక్షేమం పథకాలు అమలు చేయలేదని, ఒక్క ఛాన్స్ పేరుతో జగన్మోహన్ రెడ్డి రాష్ట్రాన్ని విధ్వంసం చేశారని విమర్శించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, ముస్లిం మైనార్టీలకు జగన్ పాలనలో రక్షణ లేకుండా పోయిందన్నారు. తనదైన శైలిలో ప్రతి ఓటర్‌ను కలిసి సైకిల్ గుర్తు పై రెండు ఓట్లు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఆయన వెంట కూటమి అభ్యర్థి వెంకటరాముడు, మాజీ ఎంపీపీ కృష్ణయాదవ్, వెంకటేష్ చౌదరి, మధు, శేషాద్రి నాయుడు, నౌనేపాటి చౌదరి, ముత్యాల రెడ్డి, వరప్రసాద్ బాబు, శేశిరెడ్డి, రహింతుల్లా, నరసప్ప పాల్గొన్నారు.

చిప్పగిరి మండలంలో మల్లికార్జున గౌడ్ ప్రచారం

చిప్పగిరి: టీడీపీ అభ్యర్థి వీరభద్ర గౌడ్ కుమారుడు మండల ఇన్‌చార్జి మల్లికార్జున గౌడ్, జడ్పీటీసీల సంఘం మాజీ అధ్యక్షుడు మీనాక్షినాయుడు



వీరభద్రగౌడ్ విస్తృత ప్రచారం

చిప్పగిరి మండలంలోని కుందనగుర్తి, బెల్డోణ, సంగాల గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ మీనాక్షినాయుడు, మండల కన్వీనర్ షేక్షావలి, మండల మాజీ ఉపాధ్యక్షుడు వెంకటేష్, కుందనగుర్తి సర్పంచ్ పురుషోత్తం, మాజీ సర్పంచ్ భీమ లింగప్ప పాల్గొన్నారు.

టీడీపీలో చేరిన యాదవ కుటుంబాలు

మల్లికార్జున్ గౌడ్ ఆధ్వర్యంలో వైసీపీకి చెందిన 50 యాదవ కుటుంబాలు టీడీపీలో చేరాయి. వారికి పార్టీ కండువా కప్పి టీడీపీ పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు.

టీడీపీ గెలుపు తథ్యం. సోమిశెట్టి

దేవనకొండ: రాష్ట్రంలో టీడీపీ గెలుపు తథ్యమని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి సోమిశెట్టి వెంకటేశ్వర్లు అన్నారు. దేవనకొండలోని టీడీపీ కార్యాలయంలో అయన మాట్లాడారు. కార్యకర్తలు పది రోజులు సైనికులవల్లె కష్టించాలన్నారు. గ్రామాలలో నాయకులు ,కార్యకర్తలు ప్రతి ఇంటికి వెళ్లి జగన్ అన్యాయాలను తెలియజేసి రాష్టానికి టీడీపీ అవసరమెంతో తెలపాలని సూచించారు. మండల కన్వీనర్ విజయ్‌భాస్కర్ ,రంగన్న, ఉచ్చీరప్ప, మల్లికార్జునగౌడ్, మలకన్న, రాజగోపాల్‌గౌడ్, బండ్లయ్య, మస్తాన్, శీను తదితరులు పాల్గొన్నారు.

ధర్మానికి... అధర్మానికి యుద్ధం

- మద్దికెర మండలంలో కేఈ శ్యాంబాబు సుడిగాలి పర్యటన
- అడుగడుగునా ప్రజలు బ్రహ్మరథం
- పంచాయతీ సభ్యులు టీడీపీలో చేరిక






మాట్లాడుతున్న కేఈ శ్యాంబాబు, ప్రచారంలో హారతులు ఇస్తున్న చిన్నారులు, ప్రచార రథంపై నుంచి ఎన్నికల సభలో మాట్లాడుతున్న కేఈ శ్యాంబాబు, కార్యకర్తలతో మాట్లాడుతున్న బస్తిపాటి నాగరాజు

మద్దికెర, మే 4: ప్రస్తుత సార్వత్రిక ఎన్నికల్లో ధర్మానికి.. అధర్మానికి యుద్ధం జరుగుతోందని టీడీపీ పత్తికొండ అసెంబ్లీ అభ్యర్థి కేఈ శ్యాంబాబు అన్నారు. శనివారం మండలంలోని మద్దికెర, కొత్తపల్లి, హంపా, బొమ్మనపల్లి, ఎడవలి, ఎం.అగ్రహారం, బీఎన్‌పేట గ్రామాల్లో ఆయన సుడిగాలి పర్యటన చేశారు. అడుగడుగునా కేఈ శ్యాంబాబుకు ప్రజలు బ్రహ్మరథం పట్టారు. మేళతాళాలు, పూలతో స్వాగతం పలికారు. అనంతరం కొత్తపల్లి, ఎం.అగ్రహారం ఆయా గ్రామాల్లో జరిగిన సభల్లో ఆయన మాట్లాడుతూ సీఎం జగన్ ఓటమి భయంతోనే కూటమిపై అబద్దాల ప్రచారాలు చేస్తున్నారని, ఇటువంటి అధర్మ ముఖ్యమంత్రిని తరిమికొట్టడానికి ప్రజలు సిద్ధం కావాలని కోరారు. సైకిల్ గుర్తుపై ఓటు వేసి టీడీపీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు.

పంచాయతీ సభ్యుల చేరిక

మద్దికెర గ్రామానికి చెందిన పంచాయతీ సభ్యులు లక్ష్మీదేవి భర్త రామక్రిష్ణ వైసీపీ గృహ సారధి గొడుగు సతీష్ కుమార్, వలంటీర్లు తిరుమలేష్, శివకుమార్ తదితరులు ఎంపీ అభ్యర్థి పంచలింగాల నాగరాజు, ఎమ్మెల్యే అభ్యర్థి కేఈ శ్యాంబాబు ఆధ్వర్యంలో టీడీపీలో చేరారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ సభ్యులు పి.పురుషోత్తంచౌదరి, రాజన్న యాదవ్, జిల్లా టీడీపీ కార్యదర్శి గూడూరు ధనుంజయుడు పాల్గొన్నారు.

కాపులంతా టీడీపీవైపే

రాష్ట్రంలో కాపులకు న్యాయం జరగాలంటే టీడీపీతోనే సాధ్యమని.. కాపులంతా టీడీపీ వైపే ఉన్నారని రాయలసీమ కాపు సంఘం నాయకులు వైపీ వీరన్న అన్నారు. టీడీపీ అసెంబ్లీ అభ్యర్థి కేఈ శ్యాంబాబు వైపీ వీరన్నను ఆయన స్వగృహంలో కలిసి మాట్లాడారు. కార్యక్రమంలో జిల్లా టీడీపీ కార్యదర్శి గూడూరు ధనుంజయుడు, లక్ష్మీదేవి, జానకీ చౌదరి తదితరులు ఉన్నారు.

తుగ్గలి మండలంలో విస్తృత ప్రచారం

తుగ్గలి : కోతికొండ, మామిళ్లకుంట తదితర గ్రామాల్లో టీడీపీ మండల అధ్యక్షుడు తిరుపాల్ నాయుడు, ప్రధాన కార్యదర్శి డీలర్ తిమ్మప్ప, ఉపాధ్యక్షుడు వెంకట్రాముడు చౌదరి ఇంటింటికి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాసగౌడు, విజయభాస్కర్, తిమ్మప్ప, హనుమంతు, ప్రతాప్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

బీసీలంతా టీడీపీ వెంటే

- సూపర్ సిక్స్ పథకాలతో ముఖ్యమంత్రిగా చంద్రబాబే
- టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి రాఘవేంద్రరెడ్డి
- మంత్రాలయం మండలంలో విస్తృత ప్రచారం
- చూడి గ్రామస్థులు టీడీపీలో చేరిక






ప్రచారం నిర్వహిస్తున్న టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి రాఘవేంద్రరెడ్డి, ప్రచార రథంపై నుంచి మాట్లాడుతున్న రాఘవేంద్రరెడ్డి, ప్రచారంలో భాగంగా అప్యాయంగా పలుకరిస్తూ.. కోసిగిలో మహిళా నాయకుల ప్రచారం

మంత్రాలయం, మే 4: రాష్ట్రంలో బీసీలంతా టీడీపీతోనే ఉన్నారని, బీసీల అభ్యున్నతి తెలుగుదేశంతోనే సాధ్యమని టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి రాఘవేంద్రరెడ్డి, టీడీపీ బీసీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు అమర్నాథ్ రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని చెట్నహల్లి, కల్లుదేవకుంట, చిలకలడోన గ్రామాల్లో ఎన్నికల ప్రచారాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా టీడీపీ నాయకులు, కార్యకర్తలు, ఎన్టీఆర్ అభిమానులు, గ్రామస్థులు నాయకులకు ఘనస్వాగతం పలికారు. ప్రచార రథంపై నుంచి వారు మాట్లాడుతూ మూడుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన బాలనాగిరెడ్డి ప్రజల కష్టాలు పట్టలేదని విమర్శించారు. ఎన్నికల్లో అవకాశం కల్పిస్తే స్థానిక సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపుతామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో తిక్కస్వామిగౌడు, పూజారి మల్లేష్, రామదాసు, రవి, గోపాల్, మల్లేష్, పెద్ద లక్ష్మయ్య, సుధాకర్ రెడ్డి, లక్ష్మయ్య, మల్లయ్య, భీమయ్య, రాగన్న, రమేష్, హనుమంతు పాల్గొన్నారు.

మంత్రాలయంలో పన్నగ వెంకటేశ్, రఘునాథరెడ్డి ప్రచారం

టీడీపీ మండల కన్వీనర్ పన్నగ వెంకటేశ్ స్వామి, ఎమ్మెల్యే అభ్యర్థి సోదరుడు రఘునాథరెడ్డి మంత్రాలయంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఎంపీటీసీ మేకల వెంకటేశ్, అశోక్ రెడ్డి, యేబు, పవన్, వరదరాజు, తెర్నేకల్లు రఘు, నాగరాజు, నరసింహ పాల్గొన్నారు.

కార్యకర్త కుటుంబానికి అండగా ఉంటాం

చిలకలడోన గ్రామంలో అనారోగ్యంతో మృతి చెందిన టీడీపీ కార్యకర్త హోటల్ రాముడు కుమారుడు రవి (39) భౌతికకాయాన్ని సోదరుడు రామక్రిష్ణారెడ్డి, తెలుగురైతు రాష్ట్ర కార్యదర్శి ఎస్ఎం గోపాల్ రెడ్డి సందర్శించి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

చూడి, బాపురంలో విస్తృత ప్రచారం

కౌతాళం : మండల పరిధిలోని చూడి, బాపురం గ్రామంలో టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, రైతు విభాగపు రాష్ట్ర కార్యదర్శి అడివప్పగౌడ్, మండల నాయకులు విస్తృత ప్రచారం నిర్వహించారు. గ్రామాల్లో పర్యటించి టీడీపీ అభ్యర్థులను గెలిపించాలని అభ్యర్థించారు. నాయకులు సురేష్, సిద్ధప్ప, రామలింగ, కురువ వీరేష్, భాజాపా, జనసేన నాయకులు పాల్గొన్నారు.

వైసీపీ నుంచి టీడీపీలోకి

చూడి గ్రామానికి చెందిన వైసీపీ కుటుంబాలు తెలుగుదేశం పార్టీలో చేరారు. వీరికి నాయకులు సురేష్‌నాయుడు, అడివప్పగౌడ్ పసుపు కండువాలు వేసి స్వాగతించారు. పార్టీలో చేరిన వారు హరిజన రామన్న, ఈరమ్మ, చిట్టెమ్మ, మారెప్ప, రంగస్వామి తదితరులు ఉన్నారు.

ప్రచారంలో నారీమణుల జోరు

కోసిగి: టీడీపీ మహిళా నాయకులు బంగారమ్మ, చంద్రిక, రమ్యలతో పాటు మహిళలు కోసిగిలోని 1,2,3,4 వార్డుల్లో విస్తృతంగా ప్రచారం చేశారు. భావ అయిన అభ్యర్థి రాఘవేంద్రరెడ్డిని గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. మరదలు బంగారమ్మ తన సొంత పుట్టినిల్లు కోసిగి కావడంతో ఇంటింటికి తిరుగుతూ ఉత్సాహంగా ప్రచారం నిర్వహించారు.

వందగల్లు వాసుల చేరిక : గ్రామానికి చెందిన వైసీపీ నాయకుడు, 5వ వార్డు మెంబర్ తలారి రాఘవేంద్రతో కలిసి 25 దళిత కుటుంబాలు టీడీపీ ఉపాధ్యక్షుడు ముత్తురెడ్డి, నాయకుడు పల్లెపాడు రామిరెడ్డి, మండల కన్వీనర్ జ్ఞానేష్ ఆధ్వర్యంలో టీడీపీలో చేరారు.